


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 12-08-2020 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 290 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### ఈ10 రాష్ట్రాల్లో కట్టడి చేస్తే..

# కరోనాపై విజయమే!

- 72గంటల ఫార్ములానే కీలకమన్న ప్రధాని మోదీ..
- కొవిడ్ టెస్టులు పెంచాలని రాష్ట్రాలకు సూచన
- వైద్య సదుపాయాలకు కేంద్రం సహాయం అందించాలి

**పీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**




దిల్లీ: దేశంలో కరోనా తీవ్రత అధికంగా ఉన్న పదిరాష్ట్రాలు వైరస్‌ను కట్టడి చేయగలిగితే కరోనాపై భారత్ విజయం సాధించినట్లేనని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. దేశంలో కరోనా పరిస్థితులు, అన్‌లాక్ అమలుపై నేడు ముఖ్యమంత్రులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మోదీ ఈ విధంగా స్పందించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 6లక్షల క్రియాశీల కేసులు ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా నమోదవుతున్న కొవిడ్ కేసుల్లో దాదాపు 80శాతం పది రాష్ట్రాల్లోనే ఉన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో పది రాష్ట్రాలు వైరస్‌ను కట్టడి చేయగలిగితే కరోనా పోరులో భారత్ విజయం సాధించినట్లేనని పునరుద్ఘాటించారు. అందుకే ఈ రాష్ట్రాల్లో కొవిడ్ నిర్ధారణ పరీక్షలను మరింత పెంచాలని సూచించారు. ముఖ్యంగా బిహార్, గుజరాత్, యూపీ, పశ్చిమబెంగాల్, తెలంగాణల్లో కొవిడ్ టెస్టుల సంఖ్య తక్కువగా ఉందని, పాజిటివిటీ రేటు ఎక్కువగా ఉన్నట్లు ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ రాష్ట్రాల్లో టెస్టులసంఖ్య భారీగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

**72గంటలే ఫార్ములాతో సాధ్యమే..**

వైరస్ సోకిన వ్యక్తిని 72గంటల్లోగా గుర్తించి పరీక్షిస్తే వైరస్ వ్యాప్తిని గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు స్పష్టంచేస్తున్నారు. అందుకే వైరస్ నిర్ధారణ అయిన వ్యక్తిని కలిసిన వారు కూడా 72గంటల్లోపే పరీక్షలు చేయించుకోవాలని ప్రధాని సూచించారు. వైరస్‌ను కట్టడిచేయడం, కాంటాక్ట్ ట్రేసింగ్, పర్యవేక్షణలే వైరస్ పోరులో కీలక ఆయుధాలని ప్రధాని మరోసారి నొక్కిచెప్పారు. ప్రస్తుతం దేశంలో కరోనా రికవరీ రేటు పెరగిందని మరణాల రేటు తగ్గుతున్నాయని మోదీ అన్నారు.

లాక్‌డౌన్ తరువాత పరిస్థితులు, అన్‌లాక్-3 అమలు జరుగుతున్న తీరుతెన్నులను పది రాష్ట్రాల సిఎంలను ప్రధాని

తరువాయి 2లో..

### తొలి వ్యాక్సిన్

# వచ్చేసింది !

**పుతిన్ కుమార్తెకు కొవిడ్ టీకా..!**

**టీకా తయారీని ధ్రువీకరించిన రష్యా అధ్యక్షుడు**



దిల్లీ: కరోనా వణికిస్తున్న వేళ కొనసాగుతున్న టీకా రేసును ఎంతో ఆసక్తిగా గమనిస్తున్న ప్రపంచానికి తొలి ఆశాకిరణం కనిపించింది. కరోనా వైరస్‌పై రష్యా తొలి వ్యాక్సిన్‌ను విడుదల చేసింది. ఈ మేరకు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటన చేశారు. తన కుమార్తె టీకా వేయించుకున్నట్టు వెల్లడించారు. దీంతో కరోనా వ్యాక్సిన్‌ను రిజిస్టర్ చేసిన తొలిదేశంగా రష్యా అవతరించింది. టీకా ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి వైరస్ నియంత్రణలోకి వస్తుందని తెలిపిన పుతిన్.. తొలుత వైద్య సిబ్బంది, ఉపాధ్యాయయులకు ఈ టీకా ఇవ్వనున్నట్టు చెప్పారు.

'కరోనా వైరస్‌పై టీకా అభివృద్ధి చేసిన తొలిదేశంగా రష్యా నిలిచింది' అని పుతిన్ ప్రకటించారు. ఈరోజు ఆయన నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు కీలక ప్రకటన వెలువడింది. ఈ టీకాకు సంబంధించిన సమాచారాన్ని తనకు ఎప్పటికప్పుడు తెలియజేస్తుండాలని ఆయన దేశ ఆరోగ్య శాఖ మంత్రి మిఖాయిల్ మురాష్కోను ఆదేశించారు.

ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ..''భవిష్యత్తులో ఈ టీకాను భారీ స్థాయిలో మనమే ఉత్పత్తి చేయగలుగుతామని ఆశిస్తున్నాను. ఇది చాలా ముఖ్యం కూడా. ఈ టీకా అభివృద్ధిలో పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రపంచం కోసం వేసిన అత్యంత కీలకమైన ముందడుగు ఇది. ఆమె (పుతిన్ కుమార్తె) కూడా ఈ టీకా ప్రయోగాల్లో భాగమయ్యారు. తొలిసారి ఆమెపై టీకాను ప్రయోగించాక శరీర ఉష్ణోగ్రత 38 డిగ్రీలకు చేరింది. తర్వాతి రోజు 37 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గింది. అంతే..ఎటువంటి దుష్ప్రభావాలు లేవు. రెండో టీకా తర్వాత కూడా ఆమె శరీర ఉష్ణోగ్రత పెరిగి.. తర్వాత తగ్గింది. ఆమె ఆరోగ్యం బాగుంది. ఆమె శరీరంలో సమృద్ధిగా యాంటీబాడీలు తయారయ్యాయి'' అని అన్నారు.

**రెండు చోట్లా టీకాల తయారీ..**

రష్యా అభివృద్ధి చేసిన టీకాలను రెండు చోట్ల తయారు చేయనున్నారు. ఈ విషయాన్ని ఆ దేశ ఆరోగ్య శాఖ మంత్రి మిఖాయిల్ మురాష్కో వెల్లడించారు. ది గమలేయా

తరువాయి 2లో..

### విషమంగా ప్రణబ్‌ముఖర్జీ

# ఆరోగ్యం



దిల్లీ: మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ దిల్లీలోని ఆర్మీ రిసెర్చ్ అండ్ రిఫరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మెదడులో రక్తం గడ్డకట్టడంతో ఆయనకు క్లిష్టమైన శస్త్రచికిత్స చేశామని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. చికిత్స తరవాత కూడా ఆయన పరిస్థితి విషమంగా ఉందని, వెంటిలేటర్‌పై ఉన్నారని మంగళవారం విడుదల చేసిన మెడికల్ బులిటెన్‌లో పేర్కొన్నాయి. కాగా, తనకు కరోనా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని సోమవారం ట్విటర్ వేదికగా ప్రణబ్ వెల్లడించారు. అలాగే గత వారం రోజులుగా తనను కలిసిన వారందరూ పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. అయితే ఆయన త్వరగా కోలుకోవాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆకాంక్షించారు. మరోవైపు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆర్మీ ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

### ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా

# సోము వీర్రాజు ప్రమాణం




విజయవాడ: ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా సోము వీర్రాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకారోత్సవం నిరాడంబరంగా జరిగింది.

ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్, బీజేపీ రాష్ట్ర సహాయ ఇంచార్జ్ సునీల్ డియోదర్, మధుకర్ జీ, పురంధేశ్వరి, కన్నా లక్ష్మీనారాయణ, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. మాజీ మంత్రి మాణిక్యాలరావు, స్వర్ణపాలెస్ ప్రమాద మృతులకు బీజేపీ నేతలు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్ర, దేశాభివృద్ధి బీజేపీ లక్ష్యమని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ అంటే అందరి జీవితాల్లో వెలుగులు నింపడమేనని ఆయన

తరువాయి 2లో..

### ఆడపిల్లలకు ఆస్తి హక్కు..

# సుప్రీం చారిత్రక తీర్పు

దిల్లీ: హిందూ అవిభక్త కుటుంబానికి చెందిన ఆస్తిపై ఆడపిల్లలకు ఉన్న హక్కును గురించి భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం నేడు చారిత్రక తీర్పు వెలువరించింది. తండ్రి (లేదా తల్లి) 2005 కంటే ముందే మరణించినా కుమార్తెలకు వారసత్వంగా ఆస్తిని పొందే హక్కు ఉంటుందని.. జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం నేటి తీర్పులో స్పష్టం చేసింది. తండ్రి, కూతురు ఇద్దరూ జీవించి ఉంటేనే కుమార్తెకు సహ-వారసత్వపు హక్కు దాఖలు అవుతుందని సుప్రీం 2005 సెప్టెంబర్ 9లో సవరణ తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సవరణ తేదీ నాటికి కుమార్తె, తండ్రి

తరువాయి 2లో..




### నేడు 'జగనన్న చేయూత'

# పథకం ప్రారంభం

**బీసీ సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాలకృష్ణ**



తూర్పు గోదావరి: రాష్ట్రంలో ఉన్న 45 నుంచి 60 ఏళ్ల మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించేం దుకు నేడు 'జగనన్న చేయూత' పథకం ప్రారంభించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాల కృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు నేరుగా ఏడాదికి 18,750 రూపాయలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని

తరువాయి 2లో..

# కాంగ్రెస్‌లోనే సచిన్ పైలట్

*నెల రోజుల రాజకీయ ప్రతిష్టంభనకు తెర..*

*సోనియా, రాహుల్‌గాంధీలకు కృతజ్ఞతలు తెలిపిన సచిన్*



జైపుర్: రాజస్థాన్‌లో నెలరోజులుగా నెలకొన్న రాజకీయ ప్రతిష్టంభనకు తెరపడింది. తిరుగుబాటు నేత సచిన్ పైలట్ వర్గం చివరకు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నట్లు ప్రకటించింది. పార్టీ అధిష్ఠానంతో చర్చల అనంతరం సచిన్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. తమ

తరువాయి 2లో..

# బాధితుల ఆరోగ్యంపై అశ్రద్ధ తగదు

***ఎల్‌జి పాలిమర్స్ ఘటనపై అంతర్జాతీయ 'వెబినార్' లో శాస్త్రవేత్తలు***

విశాఖపట్నం : ఎల్‌జి పాలిమర్స్ ఘటనలో బాధితుల ఆరోగ్యాలపై ప్రభుత్వం, యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో బాధిత ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యలపాలవుతారని ప్రముఖ రసాయన, పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈపాటికే యూరిన్, రక్తనమూనాలను పరీక్షించి బాధిత ఆరోగ్యాలపై ఎటువంటి దీర్ఘకాలిక ప్రభావం పడుతుందో నిర్ధారించాల్సివుందని అభిప్రాయపడ్డారు. బాధితుల ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ తగదని పేర్కొన్నారు. భవిష్యత్‌లో వచ్చే అనారోగ్య సమస్యలను గుర్తించి వైద్యసదుపాయం కల్పించాలన్నారు. విశాఖలో జరిగిన ఎల్‌జి పాలిమర్స్ ఘటన పర్యావసనాలపై ఆగస్టు 11,18, 25న జరగనున్న వెబినార్లలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు మొదటి వెబినార్ ప్రారంభమైంది.

ఎఎన్‌ఆర్‌ఓఇవి అనే స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించిన ఈ అంతర్జాతీయ వెబినార్‌లో అనుసంధానకర్తగా రాం చరిత్ షా (నేపాల్) వ్యవహరించారు. డోమ్‌యాంగ్ పీక్ (దక్షిణకొరియా), డాక్టర్ ఆశిష్ మిట్టల్, ప్రముఖ పర్యావరణ, రసాయన శాస్త్రవేత్తలు డాక్టర్ కె.బాబూరావు, డాక్టర్ వి.రామన్‌ధార మాట్లాడారు. గ్యాస్ లీకేజి వల్ల ఏర్పడే అనారోగ్య సమస్యలను ప్రభుత్వం యాజమాన్యం పట్టించుకోకపోవడం వల్ల బాధితులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు గురవుతారని తెలిపారు. ప్రభుత్వం, యాజమాన్యం జోక్యంచేసుకొని వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, బాధిత ప్రజలు భవిష్యత్‌లో వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడకుండా బాధ్యత వహించాలన్నారు. ఈ వెబినార్‌లో తెలుగు నుంచి ఇంగ్లీష్, ఇంగ్లీష్ నుంచి తెలుగు అనువాదకులుగా జి.ఎస్.రాజేశ్వరావు మరియు సతీష్ ప్రయాగా వ్యవహరించారు. ఎల్‌జి పాలిమర్స్ బాధిత కుటుంబాలకు చెందిన ఎం.ఉమాలక్ష్మి, కె.రాజు, శ్రీనివాస్, కిరణ్, సత్యనారాయణ మాట్లాడుతూ ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్ లీకేజి తరువాత అనేక మంది శ్వాసకోశ వ్యాధులు, ఎముకలు, కీళ్ల నొప్పులు వంటి అనేక సమస్యలతో బాధపడుతున్నారని వాపోయారు. నివాసిత ప్రాంతాల నుంచి కంపెనీని తరలించాలన్నారు. మరోసారి ఈ తరహా ప్రమాదం జరగకుండావుండాలంటే యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ వెబినార్‌లో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు, సిఐటియు నాయకులు కుమారమంగళం పాల్గొన్నారు.

# దేవరాపల్లిలో మరో నాలుగు కరోనా కేసులు నమోదు



దేవరాపల్లి : మండలంలో కరోనా కేసులు పెరుగుతున్నాయి. తాజాగా కాశీపురంలో ఒకటి, మండల కేంద్రంలో మూడు పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. దీనితో దేవరాపల్లి పి హెచ్ సి పరిధిలో 22 కేసులు నమోదయ్యాయి. మంగళవారం కాశీపురం గ్రామంలోని పెద్ద దొడ్డి వీధికి చెందిన 38 ఏళ్ళ వ్యక్తికి కరోనా పాజిటివ్ నిర్ధారణ కాగా దేవరాపల్లికి చెందిన ఇద్దరు వృద్దులకు, 55 ఏళ్ళ మహిళకు కరోనా పాజిటివ్ వచ్చినట్లు తెలిసింది. దీనితో అధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తంమై ఆయా ప్రాంతాలను కంటెన్మెంట్ జోన్లుగా ప్రకటించారు. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని అధికారులు హెచ్చరించారు. మండల కేంద్రం లో కరోనా కేసులు అధికంగా ఉన్నాయని వీటిని వైద్యులు బయట పెట్టలేదని స్థానికులు ఆరోపించారు. కొంతమంది ప్రయివేట్ ఆసుపత్రిలో కరోనా టెస్టులు చేసుకొని, పాజిటివ్ నిర్ధారణ అయిన వారు హెూమ్ క్వారెంటెన్లో ఉండి వైద్యం చేసుకొంటున్నారని, అధికారికంగా ప్రభుత్వ వైద్యులుకు తెలిసిన ఎందుకు బయట పెట్టలేదని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా దేవరాపల్లిలో గత ఐదు రోజులుగా సంపూర్ణ లాక్ డౌన్ కొనసాగుతుంది.

# 'పర్‌ఫెక్ట్' వల్లే శానిటైజర్ మరణాలు



ప్రకాశం : కురిచేడు, పామూరులో శానిటైజర్ తాగి 16 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో కీలక నిందితుడు శ్రీనివాస్‌తో సహా 10 మందిని సిట్ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కేసు వివరాలను ప్రకాశం ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ మీడియాకు వివరించారు. ఈ ఘటనకు హైదరాబాద్‌లో తయారు చేసిన 'పర్‌ఫెక్ట్'సొల్యూషన్స్ శానిటైజర్లే కారణమని ఆయన తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా జీడిమెట్లలో అక్రమంగా నకిలీ శానిటైజర్లను తయ్యారు చేశారన్నారు. మిథైల్ క్లోరైడ్‌ను విచ్చలవిడిగా వినియోగించినట్లు విచారణలో తేలిందన్నారు. శానిటైజర్ల తయారీలో అధికారులకు చిక్కినా లంచాలు ఇచ్చి బయట పడ్డారని తెలిపారు. ఈ నకిలీ శానిటైజర్లను బెంగళూరు, హైదరాబాద్‌లోని ఇతర ప్రాంతాలకు నిందితులు సరఫరా చేశారని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ వెల్లడించారు. మరోవైపు ఈ కేసులో మరో నిందితుడు, శానిటైజర్ నిర్వాహకుడు సాలె శ్రీనివాస్‌ను విచారించిన సిట్ అధికారులు సంచలన విషయాలు బయటపెట్టారు. పేదరికంలో ఉన్న శ్రీనివాస్ ఆదాయంపై ఆకర్షితుడై లాక్‌డౌన్ సమయంలో ఇంట్లోనే శానిటైజర్ తయారు చేయాలని నిర్ణయించుకున్నాడు. యూట్యూబ్‌లో చూసి శానిటైజర్ తయారు చేసి ఆ వ్యాపారం ప్రారంభించాడు. ఈ క్రమంలో పెట్టిన పదిరోజులల్లో బిజినెస్ సక్సస్ కావడం, ఆదాయం ఆశాజనకంగా ఉండటంతో ఈ వ్యాపారాన్ని వివిధ రాష్ట్రాలకు విస్తరించాలని నిర్ణయం తీసుకున్నాడు. అందుకోసం ఇద్దరు వ్యక్తులను కలిసి హైదరాబాద్ జీడిమెట్లలో పారిశ్రామికవాడ పైప్‌లైన్ రోడ్డులో పర్‌ఫెక్ట్ కెమికల్స్ అండ్ సాల్వెంట్స్ కంపెనీ ఏర్పాటు చేశాడు.

అక్కడ తయారు చేసిన శానిటైజర్‌ని తెలుగు రాష్ట్రాల్లో సరఫరా చేయడానికి ఇద్దరు పంపిణీ దారులను నియమించుకున్నాడు. అయితే పెరిగిన ఖర్చులకు తగిన ఆదాయం రాలేదనే కారణంతో ఇథైల్ ఆల్కాహాల్‌కు బదులుగా మరో ద్రావణాన్ని కలిపి విక్రయించాడు. అదే పరిస్థితుల్లో శ్రీనివాస్ కరోనా బారిన పడటంతో, ఆ బాధ్యతలను తన తమ్ముడికి అప్పగించాడు. ఇంతలో కురిచేడు ఘటన వెలుగులోకి రావడంతో ఆందోళన చెంది విజయవాడలోని తన మిత్రుడి నివాసంలో శ్రీనివాస్ తలదాచుకోగా.. అతడి ఆచూకీని తెలుసుకున్న సిట్ బృందం అదుపులోకి తీసుకున్నారు.

## కరోనా సంక్షోభంపై
# కేంద్రానికి మాజీ ప్రధాని సలహాలు



న్యూఢిల్లీ : ఆర్థిక మందగమనం, పౌరుల జీవనోపాధిపై మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా మహమ్మారి కారణంగా తీవ్రమైన దీర్ఘకాలిక ఆర్థిక మందగమనం అనివార్యమని మన్మోహన్ వ్యాఖ్యానించారు. కానీ ఈ అంశాన్ని ఆర్థిక గణాంకాలకంటే సమాజం దృష్టికోణం నుంచి చూడటం చాలా ముఖ్య మన్నారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేశారు.

కరోనా ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజల జీవనోపాధిని కాపాడాలని, వ్యాపారాలకు రుణ హామీ ఇవ్వాలని ప్రధాని మోదీకి సూచించారు. ఆర్థిక మందగమనాన్ని "మానవతా సంక్షోభం"గా అభివర్ణించిన ఆయన ప్రజల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు గణనీయ మైన ప్రత్యక్ష నగదు సహాయాలను అందించాలన్నారు. "ప్రభుత్వ మద్దతుగల క్రెడిట్ హామీ కార్యక్రమాల" ద్వారా వ్యాపారాలకు తగిన మూలధనాన్ని అందుబాటులో ఉంచాలి, సంస్థాగత స్వయం ప్రతిపత్తి ద్వారా ఆర్థిక రంగాన్ని రక్షించాలంటూ మూడు కీలక సూచనలు చేశారు.

కరోనా కట్టడికి లాక్ డౌన్ అవసరమే అయినప్పటికీ కేంద్రం సరిగ్గా వ్యవహరంచలేదని ఆయన విమర్శించారు. అకస్మాత్తుగా, ఆలోచనా రహితంగా, ముందస్తు ప్రణాళిక లేకుండా విధించిన లాక్ డౌన్, కఠిన ఆంక్షలు ప్రజలు తీవ్రంగా బాధించాయని మన్మోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి నిర్వహణను స్థానిక సంస్థలకు అప్పగించే బావుండేదని పేర్కొన్నారు. కేంద్ర విస్తృత మార్గదర్శకాలతో, స్థానిక పరిపాలనా సంస్థలు కోవిడ్-19 నివారణలో ఇంకా ఉత్తమంగా పనిచేసే ఉండేవని మాజీ ప్రధాని అభిప్రాయపడ్డారు. ఇలాంటి సంక్షోభ సమయాల్లో "అధిక రుణాలు" అవసరమే అని చెప్పిన ఆయన సైనిక, ఆరోగ్యం, ఆర్థిక సవాళ్ల అవసరాలకు స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) లో అదనంగా 10 శాతం ఖర్చు చేయవలసి వచ్చినా, అది తప్పదన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటానికి, సరిహద్దు రక్షణ, జీవనోపాధి పునరుద్ధరణ, ఆర్థిక వృద్ధికి అధిక రుణాలు అవసరమని చెప్పారు.

కాగా మహమ్మారి కారణంగా ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిని ప్రపంచ ప్రధాన ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలో కూరుకుపోయాయి. జీడీపీ గణనీయంగా తగ్గుదలను నమోదు చేస్తున్నాయి. దేశీయంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 5 శాతానికి క్షీణిస్తుందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్-జూన్ త్రైమాసిక జీడీపీ గణాంకాలు ఈ నెలలో వెల్లడికానున్నాయి

# విజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ములగాడ: పారిశ్రామిక ప్రాంతం జీవీఎంసీ 61వ వార్డ్ మల్కాపురం విజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిరాడంబరంగా నిర్వహించారు. స్వామివారికి అర్చకులచే పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసరప్రాంత భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు నూనెల శ్రీనివాసరావు(ఆర్మీ శ్రీను),ప్రధాన కార్యదర్శి నూనెల క్రిష్ణ లు మాట్లాడుతూ ప్రతీ ఏడాది అత్యంత వైభవంగా శ్రీకృష్ణుని జన్మాష్టమి వేడుకలను నిర్వహించేవారమని అయితే కారోన నేపథ్యంలో వేడుకను నిరాడంబరంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులు ఈ వేడుకలు సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కారోన మహమ్మారి నుంచి సర్వజనులను శ్రీ కృష్ణుడు కాపాడాలని వేడుకున్నట్లు తెలిపారు. దర్శనానికి విచ్చేస్తున్న భక్తులు తప్పనిసరిగా మస్కులను ధరించాలని, భౌతికదూరం పాటించి స్వామివారి దర్శనం చేసుకొని, తీర్థ ప్రసాదాలు తీసుకోవాలని, కమీటీ కి సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, సభ్యులు, భక్తులు తదితరులు హాజరయ్యారు.

# ప్రకృతి సోయగాల నిలయం..వీక్షకులకు సంబరం

ఆగస్టు 15 నుంచి పర్యాటకం పునఃప్రారంభం

కాకినాడ : ప్రకృతి సోయగాలకు నిలయంగా తూర్పుగోదావరి జిల్లా విరాజిల్లుతోంది. కరోనా మహమ్మారి కారణంగా అన్ని రంగాలపై కోలుకోలేని ప్రభావం పడింది. పర్యాటక రంగంపై మరింత ఎక్కువనే చెప్పాలి. దేశవిదేశాల నుంచి నిత్యం వేలాది మంది పర్యాటకులు గోదావరి తీరంలోని అందాలు తిలకించేందుకు వచ్చేవారు. ఆగస్టు 15 నాటికి పర్యాటక రంగంలోని అన్ని విభాగాలు పనిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇటీవల ఏపీ పర్యాటక శాఖ మంత్రి ఆదేశాలు జారీ చేశారని, దీనిలో భాగంగా అన్ని పర్యాటక కేంద్రాలను సమాయత్తం చేస్తున్నట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి పి.వెంకటాచలం తెలిపారు.

జిల్లాలో ముఖ్యమైనవి ఇవీ...: జిల్లాలో పర్యాటకంగా పేరుగాంచిన వాటిలో ఏజెన్సీ ప్రాంతంలోని మారేడుమిల్లి ఎకో టూరిజమ్ ప్రత్యేకమైంది. ఇక్కడి ప్రకృతి అందాలు, సెలయేళ్ల సందళ్లు, ఉడెన్ కాటేజీలను పర్యాటకులు అమితంగా ఇష్టపడతారు. కేరళను తలపించే కోనసీమలో దిండి రిసార్ట్ దూరప్రాంతాల వారికి అనువుగా ఉంటాయి. ఇందులో 32 విడిది గదులతోపాటు రెండు హౌస్‌బోట్లు అందుబాటులో ఉంటాయి.

మొదటి పేజీ తరువాయి

# ఈ 10 రాష్ట్రాల్లో కట్టడిచేస్తే.. కరోనాపై విజయమే!

అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంలో వైరస్ వ్యాప్తిని కట్టడిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రులు ప్రధానికి వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, పంజాబ్, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రులు ఈ భేటీలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్, హెూంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. దేశంలో కరోనా వైరస్ సంక్షోభం ప్రారంభమైనప్పటినుంచి ప్రధానమంత్రి ముఖ్యమంత్రులతో భేటీ కావడం ఇది ఏడోసారి. ఇదిలాఉంటే, ప్రస్తుతం రోజువారీ కేసులు అత్యధికంగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్,తమిళనాడు, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో నమోదవుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే దేశవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య 22లక్షలు దాటగా మరణాల సంఖ్య 45వేలు దాటింది.

ఈ కార్యక్రమంలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో కరోనా వైరస్ నివారణ కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షలకు పైగా కరోనా పరీక్షలు చేశామని తెలిపారు. ప్రతి పది లక్షల మందికి 47,459 పరీక్షలు జరిపామని చెప్పారు. మరణాలు రేటు 0.89 శాతంగా ఉందన్నారు. క్లస్టర్లలోనే 85 నుంచి 90శాతం వరకూ పరీక్షలు చేస్తున్నామని వెల్లడించారు. సాధ్యమైనంత త్వరగా పాజిటివ్ కేసులను గుర్తిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇలా చేయడం వల్ల మరణాలను అదుపులో ఉంచే అవకాశం ఉంటుందన్నారు. వైద్య సదుపాయం అందించడమే కాకుండా, ఐసోలేషన్ చేస్తున్నామని తెలిపారు. కోవిడ్ వచ్చే నాటికి వైరాలజీ ల్యాబ్ కూడా లేదని, ఇప్పుడు ప్రతి పది లక్షల మందికి 47 వేలకు పైగా పరీక్షలు చేస్తున్నామని సీఎం జగన్ ప్రధాని మోదీ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ల్యాబ్‌లు ఉన్నాయని, టెస్టుల విషయంలో స్వాలంబన సాధించామని తెలిపారు. దాదాపు 2లక్షల మంది వాలంటీర్లు క్షేత్రస్థాయిలో కోవిడ్ నివారణా చర్యల్లో పాల్గొంటున్నారని సీఎం వెల్లడించారు. అవసరమైన అందరికి టెస్టులు చేస్తున్నామని, ప్రతి రోజు 9 వేల నుంచి 10 వేల కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. 138 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను కోవిడ్ ఆస్పత్రులుగా వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 109 కోవిడ్‌కేర్ సెంటర్లు, 56 వేలకుపైగా బెడ్లు ఉన్నాయని తెలిపారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్లు కేవలం 3,286 మాత్రమే ఉండేవని తెలియజేశారు. ప్రస్తుతం రాష్టంతో 11 వేలకుపైగా ఆక్సిజన్ బెడ్లు ఉన్నాయని వెల్లడించారు.

గడచిన మూడు నెలల్లో దాదాపు 7వేలకు పైగా బెడ్లు సమకూర్చుకున్నామని ప్రధాని మోదీకి సీఎం జగన్ వివరించారు. అలాగే హెల్ప్ డెస్క్‌లను పెట్టామని, పేషెంట్లను త్వరగా అడ్మిట్ చేయించడానికి వీరు సహాయపడుతున్నారని తెలిపారు. ప్రతి మండలంలో 108 అంబులెన్స్ ఉన్నాయని, కోవిడ్‌కు ముందు 108 అంబులెన్స్ వాహనాలు 443 ఉంటే, కోవిడ్ సమయంలో మరో 768 అంబులెన్స్‌లు సమకూర్చుకున్నామని చెప్పారు. 108, 104 వాహనాలు కలిపి కొత్తగా 1088 పైగా తీసుకొచ్చామని వివరించారు. పొరుగు రాష్ట్రాల్లో ఉన్నట్టుగా మహానగరాలు తమకు లేవని, ఆ నగరాల్లో ఉన్నట్టుగా భారీ మౌలిక సదుపాయాలు ఉన్న ఆస్పత్రులూ లేవని వైఎస్ జగన్ ప్రధాని దృష్టికి తీసుకుచ్చారు. రాష్ట్రంలో వైద్య సదుపాయాలను గణనీయంగా మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం వైఎస్ జగన్‌తో పాటు హెూంమంత్రి మేకతోటి సుచరిత, డిప్యూటీ సీఎం ఆళ్లనాని, సీఎస్ నీలం సాహ్ని, డీజీపీ గౌతం సవాంగ్, వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా సోము వీర్రాజు ప్రమాణం

పేర్కొన్నారు.

ప్రతి పేదవాడికి ప్రభుత్వ ఫలాలను అందించాలన్నారు. "జన్‌ధన్ ఖాతా ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపాం. రాజకీయాలు ఎన్నికల సమయంలోనే చేయాలి. ఏపీ అభివృద్ధికి బీజేపీ కృషి చేస్తుందని" ఆయన తెలిపారు.

# తొలి వ్యాక్సిన్ వచ్చేసింది !

రీసెర్చి ఇన్‌స్టిట్యూట్, బిన్నోఫార్మా అనే కంపెనీలో తయారు చేయనున్నారని పేర్కొన్నారు. ఈ టీకాపై ఎన్నో దేశాలు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. విదేశాల్లో టీకా తయారీ అంశాన్ని ది రష్యన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఆర్‌డీఐఎఫ్) చూసుకుంటుందన్నారు.

టీకా ఇలా..

గమలేయా రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ అభివృద్ధి చేసిన ఈ టీకాలో రెండు వేర్వేరుగా ఇంజెక్ట్ చేసే పదర్థాలు ఉన్నాయి. ఈ రెండు కలిసి శరీరంలో రోగనిరోధక శక్తిని తయారు చేస్తాయి.

ఇప్పటికే పలు వ్యాక్సిన్ ప్రయోగాలు వివిధ దశల్లో ఉండగా.. రష్యా మాత్రం ఒక అడుగు ముందుకేసింది. ఈ వారం వాటిని సామాన్య ప్రజలకు ఇచ్చేందుకు సిద్ధమైంది. జూన్ 18న ఈ టీకాపై తొలి ప్రయోగాలు మొదలయ్యాయి. మొత్తం 38 మంది వాలెంటీర్లపై దీనిని ప్రయోగించారు. వీరందరిలో ఇమ్యూనిటీ పెరిగింది. తొలి బృందాన్ని జులై 15న డిశ్చార్జి చేశారు. రెండో బృందం జులై 20న డిశ్చార్జైంది.

ఆద్యంతం రహస్యం..

రష్యా తయారు చేసిన కరోనా టీకా వివరాలను ఆద్యంతం రహస్యంగానే ఉంచింది. గతనెల టీకా అభివృద్ధి చేసినట్లు ప్రకటించి ప్రపంచాన్ని ఆశ్చర్యపర్చింది. కానీ, ఈ టీకాకు సంబంధించిన వివరాలను మాత్రం వెల్లడించలేదు. దీనికి తోడు చాలా తక్కువ మందిపై క్లీనికల్ పరీక్షలు నిర్వహించడంతో చాలా దేశాలు పెదవి విరుస్తున్నాయి. లాన్సెట్, న్యూఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లో కూడా దీనిపై ఎటువంటి సమాచారం రాలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఈ టీకాపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

టీకాలు వివిధ దశల్లో

ప్రపంచ వ్యాప్తంగా టీకా కోసం భారీ రేసు జరుగుతోంది. 139 టీకాలు ప్రీ క్లీనికల్ దశలో, 25 ఫేజ్1లో, 17 ఫేజ్2లో, 7 ఫేజ్3లో ఉన్నాయి. ఈ రేసులో ఆక్స్‌ఫర్డ్-ఆస్ట్రాజెనికా, మోడెర్నా-ఎన్ఐఏఐడీ, సైనోవాక్ మూడో దశలో ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో వుహాన్ ఇన్‌స్టిట్యూట్, బీజింగ్ ఇన్‌స్టిట్యూట్, బయోన్‌టెక్-ఫూసన్ ఫార్మా, భారత్ బయోటెక్, నోవాక్స్, క్యాడిల్లా హెల్త్‌కేర్ టీకాలు ఉన్నాయి. భారత్‌లో ఆక్స్‌ఫర్డ్ టీకా ధర రూ.225 ఉంటుందని సీరమ్ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది. ఒక మంచినీటి సీసా కన్నా తాము తయారు చేసే టీకా ధర తక్కువగా ఉంటుందని భారత్ బయోటెక్ వెల్లడించింది.

# ఆడపిల్లలకు ఆస్తి హక్కు.. సుప్రీం చారిత్రక తీర్పు

జీవించి ఉన్నా లేకపోయినా ఆమెకు తండ్రి ఆస్తిలో హక్కు ఉంటుందన్న తాజా తీర్పు ప్రాముఖ్యతను సంతరించుకుంది. తాజా తీర్పుననుసరించి.. సవరణ తేదీ నాటికి కుమార్తె జీవించి లేకున్నా, ఆమె సంతానం చట్టపరంగా ఆమెకు రావలసిన వాటాను కోరవచ్చు. కుమారుడితో సరిసమానంగా కుమార్తెకూ ఆస్తిలో హక్కును ప్రసాదించిన ఈ తీర్పు.. హిందూ అవిభక్త కుటుంబాల్లో ఆడపిల్లల ఆస్తి హక్కుపై ఇప్పటి వరకు ఉన్న సందిగ్ధాన్ని తొలగించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# నేడు 'జగనన్న చేయూత' పథకం ప్రారంభం

చెప్పారు. అంటే నాలుగేళ్ళలో 75 వేల రూపాయలు వారికి ఆర్థిక సహయం అందనుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది మహిళలకు ఈ ఏడాది 4 7 00 కోట్లు కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా.. సీఎం జగన్ చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభిం చడం ఆనందంగా ఉందన్నారు. విజయవాడ స్వర్ణప్యాలెస్‌లో జరిగిన దుర్ఘటన దురదృష్టకరమని, చంద్రబాబు హైదరాబాద్‌లో ఉండి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కోవిడ్ నియంత్రణకు సీఎం జగన్ తీసుకుంటున్న నిర్ణయాలను దేశంలోని అన్ని రాష్ట్రాలు కూడా అవలంభిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లోనే సచిన్ పైలట్

వేదనను అర్థం చేసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. 'తమ సమస్యలను గుర్తించడంతోపాటు పరిష్కారానికి కృషి చేసిన సోనియా, రాహుల్, ప్రియాంకతోపాటు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు. ఈ సమయంలో నేను నమ్మిన విలువలకు కట్టుబడి ఉన్నాను. అంతేకాకుండా మెరుగైన భారత్ కోసం పనిచేస్తాను. రాజస్థాన్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కాపాడుకోవడంతోపాటు ప్రజాస్వామ్య విలువలు కాపాడటానికి కృషి చేస్తాను' అని సచిన్ పైలట్ ట్విటర్‌లో ప్రకటించారు. సొంత ప్రయాజనాలు లేవని.. కేవలం పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగానే సమస్యలను లేవనెత్తనట్లు సచిన్ స్పష్టం చేశారు.


సచిన్ పైలట్ వర్గం లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత కె.సీ వేణుగోపాల్ ప్రకటించారు. ఈసమయంలో పార్టీ నిర్ణయాన్ని సచిన్ పైలట్ స్వాగతించారు. అయితే సచిన్ పైలట్, రాహుల్ గాంధీల మధ్య జరిగిన చర్చల సారాంశం మాత్రం బయటకు రాలేదు. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్‌పై అసమ్మతి స్వరం వినిపిస్తూ మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్‌తోపాటు మరో 18మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసిన విషయం తెలిసిందే.

## ఇస్కాన్ లో నిరాడంబరంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



మధురవాడ : మహా విశాఖ జోన్ 1 పరిధి సాగర్ నగర్ ఇస్కాన్ ఆలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇస్కాన్ విశాఖ నగర శాఖ అధ్యక్షులు సాంబ దాస్ మాతాజీ నీ తాయి సేవని లా పర్యవేక్షణలో రెండు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు, ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మందిరం లో గల శ్రీ రాధాకృష్ణ దివ్య ప్రతిష్ట మూర్తులను సర్వాంగ సుందరంగా పూలమాలలతో అలంకరించారు తదుపరి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు బాలకృష్ణునికి అభిషేకము ఉయ్యాల సేవ నిర్వహించారు అలాగే ఇస్కాన్ మందిర ప్రాంగణంలో హరేకృష్ణ మహామంత్ర సంకీర్తనను మధురంగా సేవకులు ఆలపించారు అనంతరం శ్రీ రాధాకృష్ణ మూర్తులకు బాలక్రిష్ణుని ఉత్సవ మూర్తికి నివేదన నీరాజన మంత్రపుష్పం సమర్పించారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉత్సవాన్ని జరిపించారు, కరోనా కారణంగా భక్తులెవర్నీ అనుమతించకుండ నిరాడంబరంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ విశాఖ నగర శాఖ అధ్యక్షులు సాంబ దాస్ మాతాజీ ని తాయి సేవిని సంస్థ పిఆర్ఓ ఎం వి రాజశేఖర్ సేవకులు అర్చకులు పాల్గొన్నారు .

## 76వవార్డులో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

గాజువాక : జివిఎంసి పరిదిలో 76 వ వార్డ్ పెదగంట్యాడ చిన్న నడుపూరు గ్రామంలో శ్రీ కృష్ణ జనమ్మాష్టమి వేడుకలు నిరాడంబరంగా జరిగాయి. శ్రీ వంశీ కృష్ణ యూత్ ఆధ్వర్యంలో జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ భగవానుని కి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా వై ఎస్ ఆర్ సిపి ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ సకల జీవులకు రక్షకుడు, విశ్వానికి మార్గదర్శకుడు, దర్మ పరిరక్షణకుడు, యుగపురుషుడు శ్రీ కృష్ణ భగవానుడు అని అన్నారు. దేశ ప్రజలు, రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించేటట్లు కృష్ణ భగవానుడు చూడాలని ప్రార్ధించారు.

కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ దేవుని దర్శనానికి వచ్చు భక్తులు సామజిక దురం పాటించి, మాస్కులు ధరించి రావలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ ఎస్టి ప్రధాన కార్యదర్శి మార్డ్ పూడి పరదేశి, నక్క వెంకట రమణ,తాటికొండ అచ్చుత్, ప్రసాద్, డి.వెంకి,శేఖర్,మధు,రమేష్,బి ఎస్ ఫ్ ప్రసాద్, శ్రవణ్, వంశి, శివరాం, శివ, అండిబోయినసన్నీ, ప్రసాద్, గురు మూర్తి, బాబురావు,వార చైతన్య, కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ విద్యార్ధిని కి సహాయం చేసిన డేవిడ్



శ్రీకాకుళం రూరల్ మండలం : శ్రీకాకుళం రూరల్ మండలం లో గల పెద్ద పాడు గ్రామం లో గల పొందర వీధికి చెందిన గంగాధర హారిక ఎముకల క్యాన్సర్ తో బాధపడుతుంది వైద్యానికి లక్షలు అవసరమని డాక్టర్లు తెలపడంతో కుటుంబమంతా విషాదం నెలకొంది, దీనికి కారణం తల్లిదండ్రులు పేదలు , రోజువారి కూలీలు, ఈమె పెదపాడు ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతుంది, ఈమె పరిస్థితి తెలుసుకున్న శ్రీకాకుళం ట్రెజరీ హెల్పింగ్ హాండ్స్ సంఘ నాయకులు అయిన ఎం. డేవిడ్, ప్రదీప్ కుమార్, అనిల్, సంతోష్, కొండలరావు, రాజశేఖర్, రమణ మూర్తి, హేమ, సునీత, అందరూ కలిపి ఈ క్యాన్సర్ విద్యార్థినికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు, ఈ కార్యక్రమంలో పెద్దపాడు ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు అయినా మక్కా శ్రీనివాసరావు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గుండా బాల మోహన్ తరులు పాల్గొన్నారు, అలాగే మరికొంతమంది దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయాన్ని అంద చేయవలసిందిగా కోరుతున్నారు, సహాయం చేయవలసిన సెల్ నెంబరు 7093992533, ఫోన్ పే నెంబర్ 9182018180 గోవిందరావు, బ్యాంక్ ఎకౌంటు నెంబరు 73153213321, ఐ.ఎఫ్.ఎస్సి. కోడ్. నెంబరు ఏ.పీ.జీ.వీ.బీ 0001182, పెద్దపాడు బ్రాంచ్, శ్రీకాకుళం రూరల్ మండలం.

## అక్రమంగా అమ్ముతున్న మద్యం బాటిల్స్ స్వాధీనం



భీమునిపట్నం : తగరపువలస మెయిన్ రోడ్ లో స్క్రాప్ లో మద్యం బాటిల్స్ స్వాధీనం సి ఐ జి శ్రీనివాస రావు ఇచ్చిన వివరముల ప్రకారం తగరపువలస మెయిన్ రోడ్డులో ఉన్న చోడి వెంకటరావు మరియు ఇతని భార్య శ్రీదేవి స్క్రాప్ షాపు నిర్వహిస్తున్నారు దీనితో పాటుగా అక్రమంగా మద్యం కూడా విక్రయిస్తున్నారు. దీనిపై అందిన సమాచారం మేరకు సి జి.శ్రీనివాస్ మరియు సిబ్బంది దాడి చేసి వివిధ బ్రాండ్లకు చెందిన 1086 క్వార్టెర్ బాటిల్స్ స్వాధీన పరచుకొని నిందుతులను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎడ్ల అదిరాజుకు ఘన నివాళులు




ములగాడ: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు స్వర్గీయ ఎడ్ల అదిరాజుకు ఘనంగా నివాళులర్పించారు. జీవీఎంసీ 61 వ వార్డు ప్రకాశనగర్లో కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఇటీవల స్వర్గస్తులైన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసుపార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎడ్ల ఆదిరాజు కి సంతాప కార్యక్రమం నిర్వహించారు. సిటీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఎండీ.అష్రాఫ్ షరీఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఈ సంతాప కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ వెస్ట్ ఇంచార్జి జి.కోటేశ్వరావు పాల్గొని మాట్లాడుతూ ఎడ్ల ఆదిరాజు కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. సిటీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఎండీ.అష్రాఫ్ షరీఫ్ మాట్లాడుతూ ఎడ్ల ఆదిరాజు పార్టీ బలోపేతానికి చేసిన సేవలు మారువలేమని అన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు మనమంతా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ప్రెసిడెంట్ మహమూద్, యూత్ ప్రెసిడెంట్ మహేష్, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా శానిటైజర్లు, మాస్కులు పంపిణీ




అనకాపల్లి : పట్టణంలో విద్యుత్ నగర్‌లో కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని జై అనకాపల్లి సేన అధ్యక్షులు కొణతాల సీతారాం ఆద్వర్యంలో స్థానిక ప్రజలకు రెండు వందల మందికి ఉచితంగా శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేసారు. ఈసందర్భంగా బొడ్డేడ మధు, దాడి బుజ్జి, తదితరులు మాట్లాడుతూ కొణతాల సీతారాం ఆదేశాల మేరకు శానిటైజర్లు మాస్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అలాగే పట్టణ ప్రజలందరూ లాక్ డౌన్‌కి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరాల సురేష్, దేవర కృష్ణ, మజ్జి నగేష్, వియ్యపు నాని, గోపన నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్



భీమునిపట్నం : పారిశ్రామిక రంగంలో ప్రోత్సాహకాలను అందించి నిరుద్యోగ నిర్మూలన కు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ మత్స్యకార యువజన సమైక్య, రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ తెలియజేశారు. ముఖ్యమంత్రి జగన్ అధికారంలో కి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయంల ద్వారా వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి సుమారు 4 లక్షల 50 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించి వారు స్వశక్తితో కష్ట పడే విధంగా ఉపాధి కల్పన అవకాశాలు కల్పించారని, అంతేకాకుండా పారిశ్రామిక రంగంలో కొత్తగా ఏర్పాటు చేసే ప్రాజెక్టులకు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు మంజూరు చేయటం,

అదేవిధంగా విజయవాడ స్వర్ణ ప్యాలెస్ లోని కోవిడ్ కేర్ సెంటర్ లో అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత ప్రమాదంలో చనిపోయిన వారికి యాభై లక్షల రూపాయల ఎక్సగ్రేషియా ప్రకటించి, ముందు జాగ్రత్త చర్యగా అన్ని ప్రభుత్వ ప్రైవేట్ ఆస్పత్రుల్లో విద్యుత్, అగ్ని మాపక జాగ్రత్తలు తీసుకునే విధంగా అధికార యంత్రాంగం తో చర్యలు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి కార్యాచరణ చేస్తున్నారని. నూతన పారిశ్రామిక విధానం లో భాగంగా రాష్ట్రంలో మత్స్యకార యువతను ప్రోత్సహించేందుకు మత్స్యకార యువతకు ప్రత్యేక రాయితీలు కల్పించి నట్లయితే మత్స్య పరిశ్రమ కు సంబంధించిన పరిశ్రమలు స్థాపించి ఆర్థిక పురోభివృద్ధి చెందే విధంగా వలసలు నిర్మూలించే విధంగా ముఖ్యమంత్రి ఒక కార్యాచరణ చేపట్టిన వారవుతారని అన్నారు.

ఈ కార్య క్రమంలో సురపతి నర్సింగ్, మెరుగు సురేష్, వాసుపల్లి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుని విగ్రహం ప్రతిష్ట

### బొట్టవానిపాలెంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు



పరవాడ : పరవాడ మండలము రావాడ పంచాయతీ బొట్టవానిపాలెం గ్రామంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుని విగ్రహం ప్రతిష్ఠించారు.

గ్రామ పెద్దలు కారుకొండ అప్పారావు (కొండయ్య) సారిపల్లి జోగినాయుడు పెద్దలు ప్రజలు సాకారంతో శ్రీ కృష్ణ పూజ కార్యక్రమం లో గ్రామం పురోహితుడు అందూకూరి మురళీశర్మ పూజా శ్రీ కృష్ణ లీలలు గూర్చి మాట్లాడం జరిగింది. తరువాత పూజా కార్యక్రమాలు జరిపించారు. ప్రసాదం నైవేద్యం భక్తులందరికి ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అర్గనైజింగ్ కార్యదర్శి వియ్యపు చిన్నా, సమరసత సేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కేసిఆర్ మరో డ్రామాకి తెర తీశారు

విశాఖపట్నం : తెలంగాణ ముఖ్య మంత్రి కెసిఆర్ ఏపీ ప్రజల రైతుల మనోభావాలతో ఆడుకుంటూ అంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టు లపై రాజకీయ నిప్పులు రాజేసి మరోసారి సెంటిమెంట్ అస్త్రం ప్రయోగించి రాజకీయంగా చలికాచుకునే విధంగా వ్యవహరిస్తున్నారని ఏపీ ప్రజా సంఘాల జెఎసి నాయకుడు జెటి రామారావు అగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జివియంసి గాంధీ విగ్రహం వద్ద కేసీఆర్‌కు వ్యతిరేకంగా వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమం వద్దవాయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత కూడా అయనలో అంధ్ర ప్రాజెక్టు లమీద, ప్రజల మీద ద్వేషం పోలేదని అన్నారు. అనంతరం కేసీఆర్ చిత్రపటం, నల్ల జెండా లతో పలు నినాదాలు చేశారు. మరో జేఏసీ నేత కె.రామచంద్ర మూర్తి మాట్లాడుతూ అంత రాష్ట్రీయ జల విధానంలో కేంద్ర ప్రభుత్వం లేని పోని గందరగోళం సృష్టింస్తుందని, ఇప్పటికైనా సరైన విధి విధానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బొబ్బాది అప్పారావు, బి. నీలకంతం, ఆర్.తాతారావు, దయాసాగర్, దానయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

టెండరు ప్రకటన నెం. WAT/TRD/34/19-20, తేదీ. 05.08.2020

పని పేరు మరియు ప్రదేశం: వాల్తేరు డివిజన్‌లో కాలుష్యపు జోను మరియు ఇతర ఏరియాలలో ప్రస్తుతమున్న త్రుప్పు పట్టిన కాంటిలివర్ అసెంబ్లీలను హై క్రీప్ ఇన్సులేటర్లు తోటి రీప్లేస్‌మెంట్ చేయుట. (ఫేజ్-IV).

టెండరు విలువ: ₹63,42,521.00, బయానా: ₹ 1,26,900.00, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ 5,900.00, పని పూర్తి చేయు కాలం: 10 నెలలు.

టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 26.08.2020న 1500 గంటలకు,

ఇ-టెండరు డాక్యుమెంట్లుతోపాటు పూర్తి సమాచారం లభించు వెబ్‌సైట్: http://www.ireps.gov.in.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (TRD)
PR-203/L/20-21 విశాఖపట్నం

# విజయభాను సంపాదకీయం

## సింహాళ రాజకీయం!

శ్రీలంక పార్లమెంటరీ ఎన్నికలలో సింహాళ జాత్యాభిమానానికి, బౌద్ధ మతానికి ప్రతీకగా నిలిచిన 'శ్రీలంక పొడుజన పెరమున' (ఎస్ఎల్పీపీ) విజయ దుందుభి మోగించడంతో దేశ రాజకీయ చిత్రపటం సమూలంగా మారిపోయింది. 'బలమైన నాయకుడు-బలమైన దేశం' అనే నినాదంతో ప్రజలను విశేషంగా ఆకట్టుకున్న మహీంద రాజపక్స ఆదివారం ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. సంక్షేమ రాజ్యపాలన అందిస్తామనే ప్రచారం కూడా ఎస్ఎల్పీపీకి అనుకూలంగా పనిచేసింది. సుదీర్ఘకాలం శ్రీలంక రాజకీయాలలో ప్రబల శక్తులుగా ఉన్న రెండు ప్రధాన పార్టీలు యునైటెడ్ నేషనల్ పార్టీ (యూఎన్పీ), శ్రీలంక ఫ్రీడమ్ పార్టీ (ఎస్ఎల్ఎఫ్పీ) దాదాపుగా తుడిచిపెట్టుకపోయాయి. యూఎన్పీ ప్రతిపక్ష పాత్రను కూడా పోషించలేనంత దయనీయ స్థితికి దిగజారింది. యూఎన్పీ నుంచి చీలిపోయిన ఎస్జేపీ ప్రతిపక్ష పార్టీగా అవతరించింది. గత ప్రభుత్వంలో నెలకొన్న అవినీతి, అస్థిరతలను ప్రజలు ఈసడించుకోవడం వల్లనే ఎస్ఎల్పీపీకి ఘన విజయం సిద్ధించింది.

రాజపక్స నిరంకుశ పాలన ఇదివరకు శ్రీలంక ప్రజలకు అనుభవమే. అందువల్లనే గత ఎన్నికలలో గుణపాఠం నేర్పారు. ఇప్పుడు మళ్ళీ పట్టం కట్టినంత మాత్రాన నిరంకుశ పాలనకు సమర్థింపుగా భావించకూడదు. దేశంలో వేళ్ళూనుకున్న ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తే మళ్ళీ వ్యతిరేతక పెల్లుబుకవచ్చు. చీలికలు పేలికలుగా మారిన శ్రీలంక సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకురావడం రాజపక్స ముందున్న పెద్ద సవాలు. తూర్పు ఆసియా దేశాలలో బౌద్ధానికి, ఇస్లామిక్ ఉగ్రవాదానికి మధ్య ఘర్షణలు సాగుతున్నాయి. ఆ ప్రభావం శ్రీలంకపై పడటం వల్ల దేశ సమగ్రతకు కొత్త సవాలు ఎదురవుతున్నది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ముంచుకొస్తున్నది. శ్రీలంక ఇందుకు అతీతం కాదు. ఆర్థిక అనిశ్చితి సమాజంలో విభేదాలను మరింత పెంచవచ్చు. అందువల్ల సామాజిక ఆర్థిక సమస్యల పరిష్కారంపై మహీంద రాజపక్స దృష్టిసారించాలి.

గతంలో రాజపక్స దేశాధ్యక్షునిగా ఉన్నప్పుడు భారత వ్యతిరేకతను ప్రదర్శించారు. చైనాతో మైత్రి సాగిస్తూ దేశాన్ని అప్పులకుప్పగా మార్చారు. ఇటీవల ఎన్నికలకు ముందు మాత్రం భారత్‌తో స్నేహంగా ఉంటామనే సంకేతాలు ఇచ్చారు. రెండు దేశాల రాజకీయ వ్యవస్థల సారూప్యం, భౌగోళిక సామీప్యం మూలంగా భారత్‌తో చెలిమి అనివార్యమని రాజపక్స గ్రహించాలి. చైనా, పాకిస్థాన్ దుందుడుకు విధానాలు, నేపాల్ పాలకుల వైషమ్యం నేపథ్యంలో శ్రీలంక పరిణామాలను భారత్ గమనిస్తుండాలి. గతంలో మాల్దీవుల రాజకీయాల్లో చైనా తలదూర్చి కొద్దికాలం భారత్‌ను ఇబ్బందుల పాలు చేసింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తత నెలకొన్న వెంటనే భారత్ మలాకా జలసంధితో సహా ఇండో పసిఫిక్ ప్రాంతంలో నౌకాదళాన్ని అప్రమత్తం చేసింది. ఆఫ్రికా తూర్పు తీరం మొదలుకొని ఇటు ఇండో పసిఫిక్ ప్రాంతమంతా చైనాను కట్టడి చేయాలనుకుంటే శ్రీలంక చేజారిపోకుండా జాగ్రత్త పడటం అవసరం.

## రాయలసీమ ఎత్తిపోతలపై తీర్పు రిజర్వు

దిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా నిర్మించతలపెట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ఎన్జీటీలో వాదనలు ముగిశాయి. తెలంగాణకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ వేసిన పిటిషన్‌పై ఎన్జీటీ చెన్నై ధర్మాసనం ఇవాళ విచారణ చేపట్టింది. రాయలసీమ ఎత్తిపోతల పథకంలో కొత్త భాగాలను చేర్చారని ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు.

"40వేల క్యూసెక్కుల సామర్థ్యాన్ని 80వేల క్యూసెక్కులకు మార్చారు. రోజుకు 8 టీఎంసీల నీరు తరలించేలా పథకాన్ని మార్చారు. ఏపీ ఇచ్చిన సమాచారంతో కమిటీ లోపభూయిష్టంగా నివేదిక ఇచ్చింది" అని పిటిషనర్ ఆరోపించారు. దీనిపై ఏపీ ప్రభుత్వం తరపు న్యాయవాది వెంకటరమణి స్పందిస్తూ... రాయలసీమ ఎత్తిపోతల పథకం పాతదేనని వివరించారు. తమకు రావాల్సిన నీళ్లనే తీసుకుంటున్నామని తెలిపారు. కమిటీ నివేదిక కూడా ఏపీకి అనుకూలంగా ఉన్నందున కేసును ముగించాలని కోరారు.

రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని కౌంటర్ అఫిడవిట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించింది. తమ రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని వివరించింది. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై వైఖరేంటో వారం రోజుల్లో తెలపాలని కేంద్ర పర్యావరణ శాఖను ఎన్జీటీ ఆదేశించింది. తీర్పును రిజర్వు చేస్తున్నట్టు ఎన్జీటీ చెన్నై ధర్మాసనం తెలిపింది.



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మాత్యులు ధర్మాన కృష్ణదాస్ ను విశాఖ సర్క్యూట్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలుసుకొని ఘనంగా సన్మానిస్తున్న వైకాపా రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ వెలమ సంఘం నాయకులు రంగోలి జగన్నాథం, ఏపీ టెక్నాలజీ మాజీ ఛైర్మన్ కొయ్య ప్రసాద్రెడ్డి, జనరల్ సెక్రెటరీ (స్టీల్ ప్లాంట్)మంత్రి రాజశేఖర్, జి సతీష్ బార్ కౌన్సిల్ నెంబర్ కృష్ణమోహన్, చొక్కాకుల గోవిందు, రామకృష్ణ, మరియు వెలమ సంఘం నాయకులు



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖామాత్యులు ధర్మాన కృష్ణదాస్ విశాఖ పర్యటనలో భాగంగా స్థానిక సర్క్యూట్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలుసుకొని ఘనంగా సత్కరిస్తున్నారు విశాఖ వెలమ సంక్షేమ సంఘం సెంట్రల్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు, అంతకాపల్లి మాజీ సర్పంచ్ చొక్కాకుల గోవింద



విశాఖ సిటీ సర్క్యూట్ గెస్ట్ హౌస్‌కు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్‌కు స్వాగతం పలికిన జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు, ఇతర విశాఖ జిల్లా రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ అధికారులు

## సమకవి సమయం

## వంగపండు...మందుగుండు

"ఏం పిల్లడో... ఎల్దు మొస్తవా...?"అంటూ-
తిరిగిరాని లోకాలకు
వైతరణి దాటిన వంగపండు!
"సవర పిల్లులే శంఖ మూదెనట"ని-
స్ఫూర్తి పార్జన్యం పూరించిన
కరిమింగిన వెలగపండు!!
"కూడు-గుడ్డా లేని
కూలీ నాలోళ్లం"అయితే నేఉ-
ఈ దేశపు నిర్మాతలు.
"ఎలా అయితిమమ్మా పేదోల్లము...
మనము ఎలా గైతిమమ్మా పేదో ల్లమ"ని-
వెన్ను చరిచాడు.
"పండిన పంటలన్ని
మనచెమట చుక్కలు"-
దోచుకునే ముండా-రండా కొడకలకు-
"బడితెలు వట్టిన
మిడతలున్నవట"ని
"తూరుపు చూపించాడు".
"ఎన్నాళ్లయి-తిన్నామన్నా-
ఎండు తొక్కలా ఉన్నా మన్నా"అంటూ,
ఆకలి గాయం
గేయంచేశాడు.
"నీయమ్మ సచ్చినా దమ్మిడొగ్గను...
నీయయ్యా సచ్చినా దమ్మిడొగ్గన"ని
జులుం చూపిన దోపిడీదారుపై-
"చెమటంతా దోచుకొని...
సెంటు నూనె రాసుకొని...
భూములున్న బుగతోడు
వస్తున్నా...డొస్తున్నాడ"ని
పిర్రచరచి-ఎగదోసి-
"ఎదురొచ్చిన దొరబాబుని
గుండె-గుద్ది తోయ రండ"ని
ధైర్యం చూపాడు.
"సదువులేదని చెప్పి
కలతచెందకు పిల్లా...
ఎన్ని సదువుకున్నా-
ఎన్ని సోకులున్నా-
నిన్ను మించవు పిల్లో-
నా కూలోలు పిల్లా"అంటు-
సగటు పడుచు
న్యూనత నుంచి నిర్భరతకు
నడుంబిగిసిన మురికి తువ్వాలు అయ్యాడు.
"పండించి నీవు పెడితే-
దండించి బ్రతుకుతుండు"
పచ్చి నిజం... నిజం.
"అన్న మంటే నాకొడుకు- వెన్నెలా...
నిన్నే-చూపిస్తాను-వెన్నెలా!
చిన్నారి నా కొడుకును-వెన్నెలా-
సింహం పిల్లనే చేస్తాను-వెన్నెలా"అంటూ-
వగరు... పొగరు
పల్లె పిల్ల పాడుకొనే-
చల్లని వెన్నెల పాటయ్యాడు.
"తుపాకి పేల్చిన- తూరీగలున్నవట"ని
పాటల తూటా కట్టినా...
రోమాలు నిక్కిన జననెత్తురు
రాబందులపై బందూకలు పట్టినా...
ఘల్లు మంటి గజ్జెకట్టి
"జజ్జెనకరి జనారం"టే-
దోపిడీదారుల గుండె గుభేల్.
పొరుకి మొనగాడు-
పాటకు మీసం తిప్పాడు!
ఊరికి 'ఒరే కవి'...
శ్రీశ్రీ కి 'ప్రజా కవి'...
"కామాంధుల గుండె మీద
కళ్లుపుల్లనై కాలా(ను)"డు!!
వంగపండు???
మందుగుండు!!!

- పూలేసేన
కదిరి రాము





ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖామాత్యులు ధర్మాన కృష్ణదాస్ కు విశాఖ సర్క్యూట్ హౌస్ వద్ద హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న విశ్వాస్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు బెందాళం పద్మావతి, వైకాపా మహిళా నాయకురాలు కంచరానా గాయత్రి, పద్మజ తదితరులు

## తృటిలో తప్పిన పెను ప్రమాదం

### -లారీలో మంటలు....అప్రమత్తమైన సిబ్బంది



గాజువాక: ఐ ఓ సి ఎల్ టర్మినల్ లారీ పార్కింగ్ యార్డ్ సమీపంలో లారీ అగ్ని ప్రమాదానికి గురైంది. లారీ డ్రైవర్ బండి స్టార్ట్ చేస్తుండగా అకస్మాత్తుగా లారీలో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన లారీ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో హెచ్ పి సి ఎల్ అగ్నిమాపక సిబ్బంది చేరుకొని పరిస్థితిని అదుపుచేశారు. మల్కాపురం పోలీస్టేషన్ పరిధి ఐ ఓ సి ఎల్ టెర్మినల్ సమీపం లారీ పార్కింగ్ యార్డులో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.... శ్రావణ్ గ్రూపు కు చెందిన ఆయిల్ ట్యాంకర్ (అప్31 టి జి 4242) ఐ ఓ సి ఎల్ బ్లాక్ ఆయిల్ టెర్మినల్ నుండి వేదాంత పూర్ కు ఎఫ్.ఓ లోడ్ చేసుకుని వెళ్తున్న తరుణంలో షార్ట్ సర్క్యూట్ వలన ఒక్కసారి మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన లారీ సిబ్బంది హెచ్ పి సి ఎల్ అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి ని అడుపుచేశారు. దీంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. లేదంటే భారీగా,ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కలిగేదని సిబ్బంది పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు మల్కాపురం సి ఐ కూన దుర్గాప్రసాద్ తెలిపారు.

**కావలెను**
ఇంట్లోనే ఉంటూ మా కంపెనీ యొక్క SMS/Mails forward చేయుటకు **యువతీ, యువకులు** కావలెను.
అర్హత : 10th to Degree
91330 97781

## నేడు సచివాలయాల వద్ద నిరసనలు

విజయనగరం : లాక్‌డౌన్‌లో పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు డిమాండ్ చేశారు. విజయనగరంలో అమర్‌భవన్‌లో కార్మిక సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12న సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకుడు బి.రమణ, ఐఎఫ్‌టీయూ నాయకుడు మల్లిక్, ఆదిబాబు, మారయ్య, గురవారెడ్డి పాల్గొన్నారు.

# చోడవరంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

## గజపతినగరంలో ప్రత్యేక పూజలు



గజపతినగరం కృష్ణ మందిరం లో పూజలు చేస్తున్న యూనియన్ నాయకులు శరగడం రామానాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కనిశెట్టి మత్స్యా రాజు తదితరులు

చోడవరం : చోడవరం పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. చోడవరం పట్టణంలోని స్వయంభు విఘ్నేశ్వర ఆలయం ఆవరణలో గల వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వయంభు గౌరీశ్వర స్వామి ఆలయ ఆవరణలో గల కృష్ణ మందిరం లో ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి రావు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. మండలం లోని గజపతినగరం గ్రామంలో గల వేణు గోపాలస్వామి ఆలయంలో వల్లభవఝుల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు కనిశెట్టి మత్స్యరాజు, కోపరేటివ్ షుగర్ వర్కర్స్ రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ (గుర్తింపు) యూనియన్ ప్రధాన కార్యదర్శి శరగడం రామునాయుడు, స్థానిక యూత్ నాయకులు కనిశెట్టి నాగరాజు, స్థానిక రామాలయం భజన సంఘం నాయకులు శరగడం శంకర్రావు, మాజీ పాలసంఘ అధ్యక్షులు పెంటకోట సూరిబాబు, కని శెట్టి సుబ్బా రావు, స్థానిక పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే వెంకన్నపాలెం జంక్షన్ లో గల కృష్ణ మందిరం, కాశీ విశ్వేశ్వర ఆలయం ప్రాంగణంలో గల వేణు గోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంధవరం గ్రామం గోపాలకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమిని పురస్క రించుకుని విశేష పూజలు అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ యువజన సంఘం అధ్యక్షులు పళ్ళ అప్పారావు, ఉపాధ్యక్షులు పల్లా అప్పల నాయుడు, గౌరవ అధ్యక్షులు మళ్ళీ నాగేశ్వరరావు, సంఘ కార్యదర్శి ఎలమంచిలి నానాజీ, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం





దేవరాపల్లి : ఎట్టకేళ్లకు దేవరాపల్లి - ఆనందపురం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమైయ్యాయి.ఎన్నో ఏళ్ళు గా శిధిలమైన రోడ్డుకు మోక్షం కలగనుంది. ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు చొరవతో సుమారు 11 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి రూ. 15.4 కోట్లు మంజూరయ్యాయి. దీనికి మే 27న దేవరాపల్లిలో శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే, ప్రస్తుతం వాయలపాడు నుంచి దేవరాపల్లి మధ్య కల్వర్టు పనులు జరుగుతున్నాయి. ఈ పనులను ఆర్అండ్‌బి ఏఈ బి.వి కృష్ణారావు పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరాపల్లి - ఆనందపురం రోడ్డులో 25 కల్వర్టులు ఉన్నాయని, రైతుల విజ్ఞప్తి మేరకు పెరిగే అవకాశం ఉందన్నారు.

వాయలపాడు - దేవరాపల్లి రోడ్డులో ఐదు కల్వర్టులు పనులు జరుగుతున్నాయన్నారు. త్వరతగతిన రోడ్డు పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

# వివేకానంద సంస్థలో ఘనంగా 'శ్రీకృష్ణ జన్మాష్టమి' వేడుకలు

**- భక్తకోటిని ఆధ్యాత్మిక పారవశ్యంలో ముంచెత్తిన ద్రోణంరాజు శశి శ్రీనివాస్ శ్రీ కృష్ణ ప్రవచనాలు**

**- శ్రీ కృష్ణునికి 108 రకాల నైవేద్యాలు సమర్పణ**

**- భక్తిశ్రద్ధలతో... తులసి దళాలతో.. ప్రత్యేక పూజలు**

విశాఖపట్నం : విశాఖ వన్టౌన్ ప్రాంతం.. శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవ సంస్థలో..." శ్రీ కృష్ణ జన్మాష్టమి" వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వైసీపీ దక్షిణ సమన్వయకర్త ద్రోణంరాజు శ్రీనివాస్, విశాఖ అన్నదాత, ప్రముఖ సంఘ సేవకులు మట్టపల్లి హనుమంతు రావు, 29 వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి, ప్రజా సేవకులు కొల్లి సింహాచలం, ప్రముఖ సంఘసేవకులు విల్లూరి భాస్కరరావు, మణికుమార్, డి.ఎస్. అగర్వాల్, చింతపల్లి పోతరాజు, ఇల్ల రాజు, ముజీఫ్ ఖాన్, యాసిన్ బాబ్జి తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా.. శ్రీ కృష్ణునికి అత్యంత ప్రీతిపాత్రమైన.. తులసి దళాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో గోపూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో గోపూజ కార్యకమం నిర్వహించారు. గోమాతకు.. ద్రోణంరాజు శ్రీనివాస్ తదితరులు భక్తితో.. పూజలు నిర్వహించి, అరటి పళ్ళు సమర్పించి, గోవు చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ద్రోణంరాజు శశి శ్రీనివాస్ అందించిన.. "శ్రీకృష్ణ ప్రవచనాలు" భక్తకోటిని ఆధ్యాత్మిక పారవశ్యంలో ముంచెత్తాయి. సంస్థ సభ్యులందరూ భక్తితో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు..

## శాస్త్రోక్తంగా రత్నగిరిపై శ్రీకృష్ణాష్టమి వేడుకలు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్య నారాయణ స్వామివారి సన్నిధి నందు మంగళ వారం శ్రీకృష్ణ అష్టమి ని పురష్కరించుకుని ఉద యం 9 గంటలకు శ్రీ గోకులంలో(గోశాల)నందు శాస్త్రోక్తంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిరాడం బరంగా నిర్వహించారు.

కరోనా వైరస్ విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న కారణంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు పరిమిత సిబ్బందితో ఆలయ ఉప ముఖ్య అర్చకులు కోట. శ్రీనివాస్ ముందుగా శ్రీకృష్ణ డును సర్వాంగ సుందరంగా సుగంధభరితమైన పుష్పములతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోమాత కు గోపూజ నిర్వహించారు.

ప్రతీ సంవత్సరం తొలిపావంచాలా వద్ద,ఈరంకి వారి వీధిలో ఉట్ల ఉత్సవం ఘనంగా నిర్వహించడం జరిగేదని కరోనా వైరస్ కారణంగా ఈ సంవత్సరం నిలుపుదల చేయడమైనదని అధికారులు తెలిపారు.

రాత్రి 7 గంటలకు శాస్త్రోక్తంగా ఉట్ల ఉత్సవం పరిమిత సిబ్బందితో కొండపైన రామాలయం వద్ద నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకులు, వ్రత పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్థాయి కమిటీ సభ్యులకు కోవిడ్ పై అవగాహన



ఎస్.రాయవరం : ఎస్.రాయవరం మండలం , భీమవరం గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ వారి ఆదేశాల మేరకు కొవిడ్ - 19 పై గ్రామ సంఘ సభ్యులకు అంగన్వాడీ, ఆశా వర్కర్లు,వి.ఎ.ఓ లు సంయుక్తంగా అవగాహనా సమావేశం ఏర్పాటు చేసారు. ఇందులో సభ్యులు కు సూచనలు చేశారు. గ్రామాల్లో ప్రతిఒక్కరు విధిగా మాస్క్ వాడాలని, బయటకు వెళ్ళి వచ్చినప్పుడు కాళ్లు చేతులు సబ్బుతో శుభ్రంగా కడిగిన తరువాత ఇంట్లోకి వెళ్ళమని, తప్పనిసరిగా ఇంటిముందు సబ్బు బకెట్ తో నీళ్ళు ఉంచమని, ఆరోగ్య సమస్యలు ఏమైనా వుంటే వైద్యసిబ్బందికి తెలియజేసి తగిన జాగ్రత్తలు పాటించమని, పూర్తిగా వేడినీళ్ళనే త్రాగమని, పసుపు, ఉప్పు కలిపిన వేడినీటితో రెండు పూటలా ఆవిరిపట్టమని, బయటకు వెళ్లే ప్రతిఒక్కరు మాస్క్ తప్పనిసరిగా ధరించమని.... హెచ్చరించడం జరిగింది. ఈ సూచనలు, సలహాలు పాటిస్తే కరోనా బారిన పడకుండా ఉంటామని ప్రతిఒక్కరు తమ కుటుంబాలతో సంతోషంగా ఉండగలమని సూచనలు చెయ్యడం జరిగింది . ఈ సమావేశానికి వివిఓ వి. నారాయణ రావు, అంగన్వాడి కార్యకర్త రాణి , ఆశాకార్యకర్త రత్నం లు హాజరై వారి యొక్క సలహాలును ఇవ్వగా భీమవరం గ్రామ కమిటీ సభ్యులు పాల్గొనటం జరిగింది.

## రైతు భరోసా కేంద్రం వైద్య సబ్‌సెంటర్ నిర్మాణాలను అడ్డుకున్న గ్రామస్తులు



చిలకలగెడ్డ పంచాయతీ చిలకలగెడ్డ గ్రామంలో రైతు భరోసా సబ్ సెంటర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

అనంతగిరి : అనంతగిరి మండలం చిలకల గెడ్డ పంచాయతీలో పాత గిరిజన బాలుర వసతి గృహం పూర్తిగా తొలగించి అదే ప్రదేశంలో రైతు భరోసా కేంద్రం ఆరోగ్య సబ్సెంటర్ నిర్మించ టానికి అధికారులు సూచించారు అయితే స్థానిక గ్రామస్తులు ఈ యొక్క భవనము పూర్వం నుండి విద్యార్థులకు కేటాయించిన స్థలం కనుక విద్యార్థుల చదువులకు సంబంధించిన భవనాలు తప్ప ఎటువంటి భవనాలు నిర్మించ కూడదని గ్రామస్తులు అడ్డుపడ్డారు.ఈ యొక్క భవనాలు వేరే ప్రదేశంలో నిర్మించాలని వేడు కున్నారు.

తెలుసుకున్న గ్రామస్థులు వెంటనే మండల అధికారులకు తెలియజేశారు అయినా ఫలితం లేకపోయింది మండల అధికారులు నిర్లక్ష్యంగావ్యవహరిస్తున్నారని.ఆవేదన చెందారు. తహాశీల్దార్ కి పీసా కమిటీ సభ్యుడు ఎల్బి విజయ్ కుమార్ మాజీ ఎంపిపి రవణమ్మ, . బాలకృష్ణ అచ్చిబాబు.గణేష్ స్థానిక గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.

## కాజ్ వే మరమత్తు పనులు చేపట్టండి



దేవరాపల్లి : మండల కేంద్రానికి అనుకొని ఉన్న తాత్కాలిక కాజ్ వే పై పడిన భారీ రంధ్రాలను పూడ్చి ప్రజల ప్రాణాలు రక్షించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేసింది. కాజ్ వే వద్ద మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ శారదా నదిపై వంతెన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో సుమారు 20 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నా యన్నారు. దీనితో పాటు పక్కనే నిర్మించిన తాత్కాలిక కాజ్ వే కు భారీ రంధ్రాలు పడి ప్రజలు అవస్థలు పడుతున్న ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. వెంటనే కాజ్ వే కు మరమత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆదివారం భారీ ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరిం చారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి. వెంకన్న, మండల కార్యదర్శి సి హెచ్. రాజు, కె. సన్యాసినాయుడు, సన్నిబాబు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేశపాత్రునిపాలెంలో పాములు పట్టివేత



పరవాడ : జివియంసి 79వ వార్డు పరిదిలో గల దేశపాత్రునిపాలెం గ్రామంలో మంగళ వారము పాములు హల్‌చల్ చేశాయి. వెంటనే స్నేక్ సేవర్ సొసైటీ అదినేత రొక్కంకిరణ్ ను సంప్రదించగా అయన వచ్చి8పాములును పట్టు కొని విశాలమైన ప్రాంతంలో విడిచిపెట్టారు. అనంతరము స్దానిక విలేఖర్లుతో రొక్కం కిరణ్ మాట్లాడుతూ మీప్రాంతాల్లో ఎక్కడైనా విషకర మైన పాములు కనిపిస్తే ఈపోన్ నెంబర్‌ని (9849140500) సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెన్నల శివకుమార్, శనివాడ ప్రకాష్, పిల్లా సతీష్, నెలికొంట వినోద్, పప్పు అప్పలరాజు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



దేవరాపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకులు ఘనంగా జరిగాయి. కరోనా ప్రభావంతో ఈ ఏడాది శ్రీ కృష్ణాష్టమి వేడుకులను వినూత్నంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా కృష్ణుడు విగ్రహాలు అలం కరించి ఒకరు తరువాత ఒకరు వెళ్లి పూజలు జరిపారు. మండల కేంద్రం దేవరాపల్లిలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిరాడంబరంగా జరిగింది. ఈ కార్యక్రమంలో...

వైసీపీ నాయకులు కిలపర్తి భాస్కరరావు, మొల్లి కృష్ణమూర్తి, వాలేటి నాగరాజు, కె వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

## మన ఆరోగ్యం - మన చేతుల్లో

విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కరోనాపై వివక్షత, అవగాహన లఘుచిత్ర పోటీలకు ఎఫ్ క్యూబ్ క్రియేషన్స్ పతాకంపైమన ఆరోగ్యం - మన చేతుల్లోలి లఘు చిత్రం. విశాఖ - ఎంవీపీ కాలనీలో షూటింగ్ ప్రారం భ మైంది. ఈ చిత్రానికి లిపి ప్రసన్న కుమార్‌లి క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించగా మేరుగు ఎల్లాజీ దర్శకత్వం లో బాదంగీర్ సాయి, హేమ, అంగి రామ్మోహన్, యం.పవన్‌కళ్యాణ్ నటీ-నటులుగాను మరియు సునీల్ కుమార్, మనీష్ సాంకేతిక నిపుణులుగా పని చేస్తున్నారు. కథ, మాటలు : దండు నాగేశ్వరరావు. కోవిడ్ నేపథ్యంలో సాగే ఈ కథ చక్కని సన్ని వేశంతో కరోనా పై అవగాహన కల్పించేందుకు దోహదపడుతుంది అని దర్శకుడు లిఎల్లాజీలి తెలియజేశారు.

# జాతీయ విద్యావిధానాన్ని విరమించుకోవాలి




గొలుగొండ : భారతదేశంలో అనేకమైన మతాలు, కులాలు దేశ నలుమూలల ఉన్న ప్రాంతీయ భాషలు ఆచారాలతో ఉన్న ఈ దేశంలో నూతన జాతీయ విద్యా విధానం పేరుతో మతోన్మాదాన్ని ప్రేరేపించే యోచన కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమిచుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విద్యా కాషాయకరణ, విద్యా ప్రైవేటీకరణ చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ జాతీయ సమితి పిలుపు మేరకు గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న విద్యావిధానాన్ని నాశనం చేసి నూతన జాతీయ విద్యావిధానం పేరుతో చిలక పంచాంగం, సంస్కృతం, జోతిష్యం, ఇంకా కొన్ని మతోన్మాద అంశాలను బోధన చేసి చిన్న వయసులోనే విద్యార్థులకు మతోన్మాద భావాలను మెదడులోకి ఎక్కించి మతోన్మాదాన్ని పెంచి పోషించడానికి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. అంతే కాకుండా కొన్ని సంవత్సరాలుగా అభ్యసిస్తున్న విద్యావిధానాన్ని ఒక్కసారిగా మార్పు చేసి, విద్యార్థులకు చదువులు అర్థం కాకుండా చేసి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసి, ప్రభుత్వ విద్యా విధానాన్ని నాశనం చేయడమే ప్రధాన లక్ష్యంగా ఎంచుకొని, మొత్తం విద్యావిధానాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించి సామాన్య, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు చదువులు అందని ద్రాక్షల చేయాలని చూస్తున్న బిజెపి ప్రభుత్వ కుట్రను ఏఐవైఎఫ్ చూస్తూ ఊరుకునేది లేదని, ప్రభుత్వ విద్యావిధానం పరిరక్షణకు అవసరమైతే మతోన్మాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎటువంటి పోరాటాలకు కూడా వెనుకడబోమని,ప్రజలను విద్యార్థులను, విద్యావేత్తలను, మేధావులతో కూడా చర్చలు జరిపి జాతీయ విద్యావిధానం వలన జరిగే నష్టాలను దేశమంతా చర్చలు జరిగేలా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.సుధ, ఎస్.యామిని, వి.సత్యవేణి, ఎస్.మౌనిక, బాలు పాల్గొన్నారు.

# కేఎస్ఆర్ కాంప్లెక్స్ భవనం సెల్లార్లో అగ్నిప్రమాదం



విశాఖపట్నం : విశాఖలోని దొండపర్తి జంక్షన్‌లో ఉన్న కేఎస్ఆర్ కాంప్లెక్స్ భవనం సెల్లార్లో అగ్నిప్రమాదం సంభవించింది. గత అర్ధరాత్రి 2 గంటల సమయంలో సెల్లార్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో సెల్లార్‌లో నిల్వ ఉంచిన ఫర్నిచర్, వేస్ట్ ఫర్నిచర్ మంటలకు ఆహుతైంది. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని అర్ధరాత్రి నుంచి శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మంటలు అదుపులోకి వచ్చినప్పటికీ దట్టమైన పొగలు మాత్రం ఇంకా వస్తున్నాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు భావిస్తున్నారు.

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహకారంతో ఫర్నిచర్ దుకాణాల నుంచి మొత్తం ఫర్నిచర్‌ను బయటికి తీసి రోడ్డుపై ఉంచారు. భవనం మొదటి అంతస్తులో వెంకటేశ్వర ఫర్నిచర్, పూజా ఫర్నిచర్, రామ్ ఫర్నిచర్‌తో పాటు పలు ఫర్నీచర్ దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలకు సంబంధించిన ఫర్నిచర్‌తో పాటు వేస్ట్ ఫర్నిచర్ కూడా సెల్లార్‌లో ఉంచారు. ప్రమాదంలో ఫర్నీచర్ అగ్నికి ఆహుతవడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## శరభన్నపాలెంలో మరో నాలుగు కరోనా కేసులు



కొయ్యూరు : కొయ్యూరు మండలం శరభన్నపాలెం గ్రామంలో మంగళవారం అరకు ఎంపి గొడ్డేటి మాధవి చొరవతో కరోనా పరీక్షలు నిర్వహించారు. 25 మందికి రాపిడ్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించగా నలుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారించారు. ఈ సందర్భంగా ఎంపి మాధవి మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ భౌతిక దూరం పాటిస్తూ మాస్కులు ధరించాలని, ఎప్పటికప్పుడు సబ్బులతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. గ్రామంలో యువత బాధ్యతగా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరూ ఆందోళన చెందవద్దని మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపి భర్త శివప్రసాద్, డాక్టర్ ప్రణతి, ఎల్‌టి.బాబురావు, ఎఎన్ఎం చెల్లాయ్యమ్మ పాల్గొన్నారు.

## కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన ఆదిరాజు

ఆదిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



విజయనగరం : యడ్ల ఆదిరాజు కష్టకాలంలోనూ కాంగ్రెస్ పార్టీ జెండాను మోశారని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సుంకర సతీష్‌కుమార్ తెలిపారు. 'ఆదిరాజన్న' అమర్ రహే కార్యక్రమంలో భాగంగా విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. డీసీసీ అధ్యక్షులుగా, పీసీసీ ఉపాధ్యక్షులుగా పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఆయన లేనిలోటు పూడ్చలేనిదని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరి అప్పారావు, చింతపల్లి శ్రీను, షరీఫ్, లావాటి రామకృష్ణ, సుంకర సన్యాసినాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక స్పృహతో సేవలందించాలి

కాకినాడ : కాకినాడ జీజీహెచ్‌ను జిల్లాస్థాయి కొవిడ్ ఆసుపత్రిగా మార్చినందున రోగులు ఇబ్బందులకు గురికాకుండా ఉచిత బస్సుల ద్వారా వివిధ రిఫరల్ ఆసుపత్రులకు తరలిస్తున్నట్లు మంత్రి వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. కాకినాడ జీజీహెచ్‌కి ఓపీ నిమిత్తం వచ్చే రోగులను రిఫరల్ ఆసుపత్రులకు తరలించే ఉచిత బస్సులను మంత్రి, ఎంపీ వంగా గీత, కలెక్టర్ మురళీధర్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు.

# లాక్‌డౌన్‌కు సహకరించండి



అనకాపల్లి : అనకాపల్లి లాక్ డౌన్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని వైసీపీ అనకాపల్లి పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, విజ్ఞప్తి చేసారు. ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ అనకాపల్లి శాసన సభ్యుడు గుడివాడ అమర్‌నాధ్ పిలుపు మేరకు స్వచ్ఛంద లాక్ డౌన్‌కు సహకరించాలని, అన్నారు. కరోనా పెద్ద ఎత్తున ప్రభలుతున్న నేపద్యంలో లాక్ డౌన్ ద్వారా అదుపు చేయవచ్చునన్నారు. ప్రభుత్వ అనేక చర్యలు తీసుకున్నప్పటికీ రోజు రోజుకు కరోనా కేసులు పెరగడంతో లాక్ డౌన్‌కు పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని, కరోనా బారీన పడకుండా అప్రమత్తంగా ఉంటూ నిర్లక్ష్యం వీడి కరోనా సహకరించాలన్నారు. ప్రాణం కన్నా ఏది ముఖ్యం కాదని ప్రజలు ఇళ్లకు పరిమితం కావాలని కోరారు.

## నేటి నుండి నెలరోజులు వరకు
# పరవాడలో స్వచ్ఛంద లాక్‌డౌన్



పరవాడ : పరవాడ గ్రామంలో ఒక నెల రోజుల పాటు కరోనా మహమ్మారి తీవ్రత ను నిర్మూలించే మార్గంలో స్వచ్ఛందంగా పరవాడ గ్రామం అంత (సబ్ స్టేషన్ మరియు సినిమా హాలు జంక్షన్ కలుపుకొని) ఉదయం 7 నుండి 11 వరకు మాత్రమే వ్యాపారాలు కొనసాగించాలని, పోలీస్ సిబ్బంది మరియు వైద్యాధికారుల సలహాల మేరకు కొనసాగించడం జరుగుతుంది అని రూల్స్ కు వ్యతిరేకంగా వ్యాపారస్తులు తమ వ్యాపారాలను నిర్వహించినట్లు అయితే వారిపై చర్యలు తీసుకొని పడతాయని 500/- తో ఫైన్ వసూలు చేయడం జరుగుతుందని పంచాయతీ సిబ్బంది మరియు గ్రామపెద్దలు,పరవాడ యువత తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో హస్పటల్ సిబ్బంది నాయుడు,ఎఎన్ ఎమ్ రత్నం స్దానిక నాయకులు రెడ్డిశ్రీనువాసురావు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మికం అవసరం

వైసీపీ నాయకులు కూండ్రపు వెంకునాయుడు



అచ్యుతాపురం : ప్రతి ఒక్కరికి ప్రశాంత జీవితానికి ఆధ్యాత్మికం అవసరమని వైసిపి నాయకులు కూండ్రపు వెంకునాయుడు అన్నారు . మంగళవారం మండల కేంద్రమైన అచ్యుతాపురంలో కృష్ణష్టామి వేడుకలు ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా తోడపెద్దుని అలంకరణ చేసి, కృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నేటి కాలంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కలిసి మెలిసి ఉండటానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కూనిశెట్టి రమణ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు పదవి పోయి మతిభ్రమించింది

వైసీపీ జిల్లా నాయకులు జల్లిబాబులు



కొయ్యూరు : చంద్రబాబునాయుడుకు పదవీ పోయేసరికి మతిభ్రమించిందని వైసిపి జిల్లా నాయకులు జల్లిబాబులు ఆరోపించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. అమ్మఒడి, రైతు భరోసా, విద్యాదీవెన, నాలుగు లక్షలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. అదే విధంగా వైయస్సార్ చేయూత ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఇది చూసి ఓర్వలేక ప్రభుత్వం పై బురదజల్లే ప్రయత్నాలు చేయడం సరైంది కాదన్నారు. వైసిపి ప్రభుత్వానికి ప్రజలు జైజైలు కొడుతుంటే చంద్రబాబు హైదరాబాద్‌లో ఉండి ఏడుస్తున్నారన్నారు. ఆయనతో పాటు మండల నాయకులు బంటు నాగేశ్వరరావు ఉన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కొయ్యూరు : కొయ్యూరు మండలం బాలారం గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గల కృష్ణ భగవాన్ ఆలయాంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. పిల్లలతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు మురుకుర్తి అప్పలరాజు పాల్గొన్నారు.

## సింగవరంలో హైపోక్లోరైట్ ద్రావణం పిచికారీ



కొయ్యూరు : కంటైన్‌మెంట్ జోన్ అయిన సింగవరం గ్రామంలో హైపోక్లోరైట్ ద్రావణం పిచికారీ చేశారు. కరోనా సోకకుండా ఈ ప్రాంతంలో ఈ ద్రావణాన్ని పిచికారీ చేసినట్లు ఈవోపిఆర్‌డి రామగోవింద్, సెక్రటరీ శ్రీను తెలిపారు.

# నారా చంద్రబాబు నాయుడుని ఉద్దేశించి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

- మాజీ ఉపముఖ్యమంత్రి మరియు పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప

పెద్దాపురం : నారా చంద్రబాబు నాయుడుని ఉద్దేశించి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యాలను ఖండిస్తున్నాం..... మా ఎమ్మెల్యేలు అందరం కూడా ఆ రోజు ప్రభుత్వంతోనే ఉన్నాము... రాష్ట్రానికి ఒక మంచి రాజధాని కావాలని నిర్ణయించి 33,000 ఎకరాల భూమిని సేకరించి వరల్డ్ క్లాస్ రాజధానిగా అభివృద్ధి పరిస్తే.... ఈ రోజు రాజధానిని సమూలంగా నాశనం చేయాలని.....తలంపుతో ప్రస్తుత ప్రభుత్వం రాజధానిని సర్వనాశనం చేస్తోంది. మంచి రాజధాని నిర్మాణం జరిగితే ఆ పేరు చంద్రబాబు నాయుడుకి వస్తుంది అనే ఉద్దేశ్యంతో నే రాజధాని మార్పు అంశాన్ని తెరపైకి తెచ్చారు. ప్రభుత్వం ఏర్పడిని వెంటనే అమరావతి అన్ని విధాల అభివృద్ధి చేస్తామని చెప్పిన బొత్స సత్యనారాయణ, ఆ తరువాత జగన్మోహన్ రెడ్డి హెచ్చరించడంతో వెనక్కి తగ్గారు. తదుపరి రాజధాని అంశంపై ఎక్కడ మాట్లడిన దాఖలులు లేవు. ఈ మధ్య మూడు నెలల క్రితం బొత్స సత్యనారాయణ గారు రాజధాని ప్రాంతాన్ని సందర్శించి అక్కడ నిర్మాణాంలో ఉన్న వివిధ బిల్డింగ్ లు పరిశీలించి రాజధానిలో ఇంత అభివృద్ధి జరిగిందా... అని ముక్కున వేలు వేసుకొన్నారు. ఇంత అభివృద్ధి జరిగిందా అని ఆశ్చర్యాచికుతులైనారు. ప్రస్తుతానికి నూటికి 70 శాతం పనులు పూర్తయితే...వైసిపి ఎమ్మెల్యేలు ఇంత ఖర్చు ఎలా అయింది అనడం.... విడ్డూరం.... ఈ రోజు అఖిల భారత సర్వీసు అధికారులు మరియు ఎమ్మెల్యేల ఎన్.జి.వో సంబంధించి క్వార్టర్స్ పూర్తి కావడానికి సిద్ధంగా ఉన్నాయి. అమరావతి రాజధానిలో విశాలమైన రోడ్లు నిర్మించడం జరిగింది. ఆ రోడ్లు మీరు రోజు వినియోగిస్తున్నారు. ఈ రోజు రాష్ట్ర సర్వోన్నతం న్యాయస్థానం... రాజధాని నిర్మాణం కోసం ఎంతో ఖర్చు చేసి మధ్యలో వదిలేస్తే.. అది ప్రభుత్వానికి నష్టం కాదనీ ప్రజా ధనాన్ని జరిగిన నష్టమని భవన నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయి... జనం డబ్బు దుర్వినియోగం అవుతూంటే చూస్తూ ఉండలేమని వ్యాఖ్యానించింది. కాబట్టి ఎమ్మెల్యే లు ఇటువంటి మాటలు మాట్లాడం సహేతుకం కాదనీ తెలియజేస్తున్నాను. మరి బొత్స సత్యనారాయణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కావాలని విశ్వప్రయత్నం చేశారు.. ఆ రోజు జగన్ గారి కుటుంబాన్ని అవినీతి కుటుంబం అని తులనాడారు. అంతేకాకుండా స్వర్గీయ వైస్ రాజశేఖర్ రెడ్డి గారి మరణానికి జగన్ కారణం అని బొత్స నిందించారు. తరువాత పార్టీ మారాడు. బొత్స ఐదు సంవత్సరాలు ఇంట్లో కూర్చుని.... అమరావతి అభివృద్ధిని చూసి... ఈ రోజు మంత్రి అయిన తర్వాత అది పురపాలక మంత్రి అయివుండి తన స్టేట్మెంట్ ద్వారా ప్రజలను గందరగోళాన్ని సృష్టిస్తూన్నాడు. బొత్స సత్యనారాయణ మీ గురించి ఈ రాష్ట్ర ప్రజలందరికీ విదితమే.... ఎందుకంటే మీరు సుదీర్ఘ కాలం పాటు రాజకీయాల్లో ఉన్నారు... మీరు ఏమి చేశారో ప్రజలకు తెలుసు. తెదేపా ఎమ్మెల్యేలు అందరు చంద్రబాబు నాయుడు తోనే ఉన్నారు. ఈ రోజు ప్రజలు కూడా చంద్రబాబు నాయుడుతోనే ఉన్నారు. వైసీపీ వారిని ఎన్నికలకు రమ్మంటే ఎందుకు భయపడుతున్నారు. మీకు ధైర్యం ఉంటే ఎన్నికలకు సిద్ధం కండి... మీరు రాజీనామా చేసి... గెలవండి.. చంద్రబాబు నాయుడు సవాల్ ను స్వీకరించండి... ఎందుకంటే మీరు గంటకు ఒక మాట మాట్లాడాడం.... ఈ రకంగా చంద్రబాబు నాయుడుని గాని ఎమ్మెల్యేలను గాని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఉరుకోమని హెచ్చరిస్తున్నాం.

ఆంధ్రప్రదేశ్ కొత్త రాష్ట్రంగా ఏర్పడినప్పుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా ఒక వరల్డ్ క్లాస్ రాజధాని నిర్మించాలి అని అమరావతి ప్రాజెక్టును తీసుకురావడం జరిగింది. ఈ ప్రాజెక్టు నిమిత్తం రాజధాని ప్రాంత రాజధాని రైతులందరు తమ భూములను ఇచ్చి సహకరించారు. రాజధాని ప్రాంతంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలోను సమాంతరం అభివృద్ధి జరగాలని 160 ప్రాజెక్టులు తీసుకురావడం జరిగింది. అదేవిధంగా కేంద్రం మంజూరు చేసిన 12 కేంద్ర విశ్వ విద్యాలయలను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయడానికి ప్రకటించడం జరిగింది. మరి రాయలసీమకు సంబంధించి, రాయలసీమకు నీరందించాలని అక్కడ ప్రాజెక్టులు పూర్తిచేయడాం జరిగింది..అదేవిధంగా అనేక పరిశ్రమలు తీసుకురావడం జరిగింది. అలాగే కర్నూలుకు విద్యుత్ ప్రాజెక్టు మరియు చిత్తూరులో అనేక ప్రాజెక్టులు అభివృద్ధి చేయడం జరిగింది. కృష్ణా డెల్టాకు నీరు అందించేందుకు పట్టీసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాకు నీరు అందించడం జరిగింది. అదేవిధంగా ఉత్తరాంధ్ర జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిమిత్తం స్పెషల్ ప్యాకేజీ ప్రకటించి అభివృద్ధిలో ఉత్తరాంధ్ర



జిల్లాలకు సముచితం స్థానం కల్పించి అక్కడ ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం జరిగింది. హూద్ హూద్ తుఫాన్ తర్వాత విశాఖపట్నం ను అన్ని విధాల అభివృద్ధి చేసి ఆర్థిక రాజధానిగా మలచడం జరిగింది. చంద్రబాబు నాయుడు గారి విజన్ తో రాజధానితో పాటు అన్ని జిల్లాల అభివృద్ధి చేయడం జరిగింది. అదేవిధంగా రాష్ట్రంలో ప్రజా అవసరాలు మరియు రవాణా అవసరాల దృష్ట్యా మొత్తం నాలుగు లైన్ల రోడ్లు, ఆరు లైన్ల రోడ్డలుగా అభివృద్ధి చేయడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాధమిక అవసరాల కోసం సిమెంటు రోడ్లు, మంచినీటి సౌకర్యం, ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ బిల్డింగులు మొదలైన వాటిని ఏర్పాటు చేసి మంచి గ్రామీణ వాతావరణం ఏర్పటుచేయడం జరిగింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం మూడు నెలలు కావస్తున్నా..... ఎక్కడ అభివృద్ధి నోచుకోలేదు..... ఒక్క పైసా అభివృద్ధి పై ఖర్చు చేయలేదు...ముఖ్యమంత్రి కేవలం రాజధాని మార్పుపైని దృష్టి సారించారు. మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రజావసరాలను విస్మరించారు. ఈ రోజు కరోనా వైరస్ కల్లోలం సృష్టిస్తున్న వైరస్ నిరోధించే చర్యలు చేపట్టడంలో ను ఫ్రంట్ లైన్ వారియర్స్ కు కావలసిన సామాగ్రి ఏర్పాటు విషయంలోనూ.. క్వారెంటైన్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన విషయంలోను ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని.... ఈ చర్యలతో ప్రజారోగ్యంతో పాటు.... రాష్ట్ర అభివృద్ధి కూడా కుంటుపడుతుంది అని చెప్పి తెలియజేస్తూన్నాను.

# ఆన్‌లైనులో వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేయకపోవడమే సురక్షితం

## - విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐపిఎస్



విజయనగరం : రాష్ట్ర పోలీసుశాఖ, సిఐడి విభాగం మరియు సైబరు పీస్ ఫౌండేషను సంయుక్తంగా నిర్వహిస్తున్న "ఈ రక్షా

బంధన్ 4 ఎస్" కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రముఖ సైబరు నిపుణుల సహకారంతో 'అండర్‌స్టేండింగు డేటా అండ్ డిజిటల్ ఫుట్ ప్రింట్స్' అన్న అంశంపై వెబినార్‌ను నిర్వహించి, రాష్ట్ర ప్రజలకు, మహిళలు, విద్యార్ధులకు, ఉపాధ్యాయులకు మరియు సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి.రాజకుమారి మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని ఆన్‌లైనులో ఇతరులతో పంచుకోకపోవడమే సురక్షితమన్నారు. ప్రస్తుతం సాంకేతికత వినియోగం పెరిగిందని, ప్రజలు, విద్యార్ధులు ఇంటర్నెట్, సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగిస్తూ ఎక్కువ సమయాన్ని గడుపుతున్నారన్నారు. చాలా మందికి డిజిటల్ లిటరసీ లేకపోవడం, సాంకేతికత గురంచి సంపూర్ణ అవగాహన లేకపోవడం వలన సైబరు నేరాలకు గురవుతున్నామన్నారు. కావున, ప్రతీ ఒక్కరూ సాంకేతికత అభివృద్ధి చెందు తున్నందున డిజిటల్ లిటరసీని కూడా మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యక్తిగత ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన సందర్భాల్లోమనకు తెలియకుండానే సందరు ఫోటో ఐదు కంటే ఎక్కువ ఫోటోలుగా కాపీ అయ్యి, వివిధ ప్రాంతాల్లో సేవ్ అవుతాయన్నారు. సదరు ఫోటోను మన మొబైల్ నుండి, మనము పంపిన స్నేహితుడి మొబైల్లో నుండి తొలగించినప్పటికీ ఫోటోలో ఇంకనూ సర్వర్, ఫైల్ మేనేజరు, గూగుల్ ఫోటోస్, క్లౌడ్‌గా ఇంకనూ నిక్షిప్తమయ్యే ఉంటాయన్నారు. పాస్‌వర్డు, మెసేజ్స్, కాల్స్, ఫోటోలు, వీడియోలు, లకేషను, ఫైనాన్స్, కాంటాక్ట్స్, సెన్సార్స్, బిహేవియర్స్ వినియోగంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఇబ్బందులు తలెత్తి, మోసాలకు గురయ్యే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. గూగుల్ మ్యాప్స్‌లో సెట్టింగ్సుతో ఏ సమయంలో మీరు ఎక్కడకి వెళ్ళింది, ఎంత సమయం గడిపింది. సులువుగా ఇతరులు గుర్తించవచ్చునన్నారు. సోసల్ మీడియాలోను, ఇంటర్నెట్ వినియోగంలో మీ ఆసక్తి అనుగుణంగా యాడ్స్ రావడం, వ్యక్తిగత ప్రైవసీని కోల్పోతామన్నారు. సెలబ్రిటీస్ పేరుతో సైబరు నేరగాళ్ళు అకౌంట్స్ క్రియేట్ చేసి, ఫ్రెండ్స్ రిక్వెస్ట్ పంపడం, వారితో ఎటువంటి పరిచయం లేకపోయినప్పటికీ సదరు వ్యక్తుల గురించి పూర్తిగా తెలియకుండానే ప్రైవేటు ఫోటోలను వారికి షేర్ చెయ్యడం, అనంతరం వారి నుండి వేధింపులు, బెదిరింపులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పోలీసులకు చేసిన ఫిర్యాదుతో సదరు వ్యక్తి సెలబ్రిటీ కాదని, మోసగాడిగా వెల్లడైన సందర్భాలు చాలా ఉన్నాయన్నారు. గూగుల్ అకౌంట్స్‌లో సెట్టింగులను ఏర్పాటు చేసుకోవడం వలన అలర్ట్స్ వచ్చే విధంగా, ఫేస్ బుక్‌లో సేఫ్టీ సెంటరులో సెట్టింగ్సులను మార్పు చేసుకోవడం వలన సురక్షితంగా సైబరు మోసగాళ్ళు నుండి కొంత వరకు సురక్షితంగా ఉండవచ్చునన్నారు. పివి సునీల్ కుమార్, సైబరుపీస్ ఫౌండేషను కమ్యూనికేషన్ మేనేజరు జెనిసివెర్గేస్, పద్మావతి మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. జమున దువ్వూరు, సిఐడి ఎస్పీ రాధిక పాల్గని, ప్రజలకు, మహిళలు, విద్యార్ధులు, బాలలకు సైబరు నేరాల నియంత్రణ పట్ల అవగాహన కల్పించినట్లుగా విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి తెలిపారు. ఈ "రక్షా బంధన్ 4ఎస్" కార్యక్రమంలో భాగంగా ఆగష్టు 11న ఉదయం 11 గంIIల నుండి 'ఆన్‌లైను ట్రాన్సాక్షన్ సేఫ్టీ' అనే అంశంపై వెబినార్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగినవారు ఏపీ పోలీసు యూ ట్యూబ్ లైవ్ వీడియోను వీక్షించవచ్చునని విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి తెలిపారు.

# జర్నలిస్ట్ సుధీర్‌కు చందు ఆర్ధిక సాయం

కాకినాడ : భారతదేశంలో కరోనా లోక్డౌన్ నేపద్యంలో కరోనా వారియర్స్‌గా ప్రభుత్వ అధికారులు సిబ్బంది, డాక్టర్లు, నర్సులు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది శానిటేషన్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలకు సేవలు అందించడంలో ఎంత ప్రాధాన్యత ఉందో..అంతకంటే ప్రాధాన్యత గల రంగం మీడియా రంగమని...ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తూ వారి కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ పాత్రికేయులు అందించే సేవలు అనిర్వచనీయమైనవని పుల్ల చంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థకులు పుల్ల చందు అన్నారు.దానిలో భాగంగా కాకినాడ రూరల్ మండలంలో పని చేస్తున్న టీవీ-7 సుధీర్ మాతృమూర్తి ఇటీవల అకాల మరణంకు చింతిస్తూ..వారి తండ్రి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కారణంగా మంత్రి వర్యులు కూరసాల కన్నబాబు పిలుపు మేరకు ట్రస్ట్ తరపున రూ.5వేలు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్ల చక్రి, మాజీ ఎంపీటీసీ శీలం నాగేశ్వరరావు, మాజీ సర్పంచి బొండాడ విజయ లక్ష్మణ్, మీడియా ప్రతినిధులు దైవ తదితరులు పాల్గొన్నారు.

# సాగరమాల ప్రాజెక్టు ద్వారా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాము

**జిల్లా కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డి**



కాకినాడ : జిల్లాలో తీరప్రాంత ప్రదేశాలలో సాగరమాల ప్రాజెక్టు ద్వారా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం షిప్పింగ్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సాగరమాల ప్రాజెక్టు చైర్మన్ శారద ప్రసాద్ దేశంలో ఉన్న 77 తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు,రాష్ట్ర స్థాయి అధికారులతో జూమ్ యాప్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టర్ డి మురళీధర్రెడ్డి ఆయన క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ సాగరమాల ప్రాజెక్టు ద్వారా పోర్టులు అభివృద్ధి చేయడంతోపాటు మౌలిక సదుపాయాల కల్పన, ఫిషింగ్ హార్బర్ లు అభివృద్ధి, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు, టూరిజం ప్రాజెక్టులు అభివృద్ధి, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు, ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ మరియు సముద్రాన్ని జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న లక్షలాది మత్స్యకార కుటుంబాలకు మేలు చేకూర్చే విధంగా వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా లో తీర ప్రాంతం అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. తొండంగి మండలంలో జిఎంఆర్ గ్రూప్ సంస్థ ఒక పోర్టు ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదేవిధంగా రాష్ట్ర మారిటైన్ బోర్డు రూ.100 కోట్లలతో యాంకరేజ్ పోర్టు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఉప్పాడ వద్ద రూ.350 కోట్ల తో కొత్తగా ఒక ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని త్వరలోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందని సాగరమాల ప్రాజెక్టు చైర్మన్ శారదా ప్రసాద్ కు జిల్లా కలెక్టర్ తెలిపారు.

# జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ కు ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలి

## సిఐటియు ఆధ్వర్యంలో 2వ రోజు కొనసాగిన ఆందోళన



కాకినాడ : కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో పారిశుద్ధ్య సేవలు నిర్వహిస్తున్న కార్మికులకు ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలని సిఐటియు అనుబంధ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది.

కనీస వేతనాలు అమలు చేయాలని సోమవారం ప్రారంభించిన ఆందోళన 2 వ రోజైన మంగళవారం కూడా కొనసాగించారు...ఈ సందర్భంగా కార్మికులు వివిఎన్ కుమార్, భాగ్యవతి లు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలు జిజిహెచ్ లో పారిశుద్ధ్య సేవలు నిర్వహిస్తున్నప్పటికీ తగిన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కార్మికులు కూడా కోవిడ్ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిజిహెచ్ ను కోవిడ్ ఆసుపత్రి గా మార్చాక శానిటేషన్ లో పనిభారం బాగా పెరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు ఆసుపత్రులలో పారిశుద్ధ్య కార్మికులకు 16,000/- రూ. జీతం 2020 జనవరి నుంచి అమలు చేస్తున్నట్లు ప్రకటించి జి.ఓ. విడుదల చేసినా తమకు న్యాయం జరగలేదన్నారు. కాబట్టి కనీస వేతనాలు అమలు చేయాలని, పి.ఎఫ్, ఈ.ఎస్.ఐ. కాకినాడ లోనే చెల్లించాలని, ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని, కోవిడ్ సేవల నేపథ్యంలో కార్మికులందరికీ ఇన్సూరెన్స్ చేయాలని, గత 4 నెలలు గా సేవలు చేస్తున్నందుకు గాను 2 నెలల జీతం అదనంగా ప్రోత్సాహం గా ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఆందోళన చేస్తున్నామన్నారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారు జోక్యం చేసుకుని జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ న్యాయమైన డిమాండ్ లు పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణ్, ఎం.వి.రమణ, దుర్గా ప్రసాద్, జనార్ధన్, వాసు, విఘ్నేష్, వీరబాబు, శారద, శాంతకుమారి, నాగేశ్వరరావు, సురేష్, జ్యోతి, రమణమ్మ, చంద్రకళ, అరుణ తదితరులు పాల్గొన్నారు....

# క్షీణించిన నవనీత్ కౌర్ ఆరోగ్యం



ముంబై : అమరావతి ఎంపీ నవనీత్ కౌర్ ఆరోగ్యం క్షీణించగా నాగ్‌పూర్‌లోని దవాఖానకు తరలించారు. నవనీత్ కౌర్ సహా కుటుంబంలోని 12 మంది మహమ్మారి బారినపడ్డారు. ఇటీవల ఆమె పాజిటివ్‌గా పరీక్షించడంతో చికిత్స కోసం అమరావతి దవాఖానలో చేరారు. అయితే, చికిత్స పొందుతున్న క్రమంలో ఆమె ఆరోగ్యం క్షీణించింది. దీంతో నాగ్‌పూర్‌లోని ఓఖార్డ్ హాస్పిటల్‌లో చేరారు. నవనీత్ కౌర్ భర్త రవి రానాకు ఆగస్టు 6న కరోనా పాజిటివ్‌గా తేలింది. తరువాత కుటుంబంలోని మొత్తం 12 మంది సభ్యులు ఈ వైరస్ బారిన పడ్డారు. ఇందులో నవనీత్ కౌర్ పిల్లలు, అత్తమామలు కూడా ఉన్నారు. కరోనా బారిన పడ్డామని నవనీత్ కౌర్, రవి రానా సోషల్ మీడియాలో ధ్రువీకరించారు. గత కొద్ది రోజులుగా తమను కలిసి వారు పరీక్షలు చేయించుకోవాలని, క్వారంటైన్‌లో ఉండాలని విజ్ఞప్తి చేశారు. నవనీత్ కౌర్ తెలుగులోనూ పలు చిత్రాల్లో నటించారు. కొద్ది రోజుల కిందట రవి రానాను పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో అమరావతి నియోజకవర్గం నుంచి ఎంపీగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. శివసేన ఎంపీ ఆనందరావును భారీ తేడాతో ఓడించారు. నవనీత్ కౌర్ భర్త, యువ స్వాభిమాన్ పార్టీ నాయకుడు. రవి రానా బద్నేరా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# భారత హాకీలో కరోనా కలకలం

## ఆరో పాజిటివ్ కేసు నమోదు



న్యూఢిల్లీ: భారత హాకీలో కరోనా కలకలం రేపుతోంది. జాతీయ స్థాయి ఆటగాళ్లు వరుసగా కరోనా బారిన పడుతూ ఉండటం ఇండియన్ హాకీలో ఆందోళన రేకెత్తిస్తోంది. తాజాగా ఆరో పాజిటివ్ నమోదు కావడంతో మరోసారి అలజడి రేగింది. హాకీ ఆటగాడు మన్‌దీప్ సింగ్‌కు తాజాగా కరోనా బారిన పడ్డాడు. తాజాగా జరిపిన కోవిడ్-19 టెస్టుల్లో మన్‌దీప్‌కు కరోనా సోకినట్లు నిర్ధారణ అయ్యింది. తద్వారా భారత హాకీలో ఆరో పాజిటివ్ నమోదైంది. ఈ విషయాన్ని సాయ్ ఓ ప్రకటనలో తెలిపింది.ఆగస్టు 20వ తేదీ నుంచి నేషనల్ క్యాంప్ ఆరంభించడానికి సన్నాహకాలు ప్రారంభించిన తరుణంలో వరుసగా క్రీడాకారులు కరోనా బారిన పడటం గుబులు పుట్టిస్తోంది.

దాంతో జాతీయ క్యాంపును వాయిదా వేసే పరిస్థితిపై భారత హాకీ సమాఖ్య చర్చలు జరుపుతోంది. గతవారం భారత హాకీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్‌తో పాటు మరో నలుగురు కోవిడ్ బారిన పడ్డారు. సుదీర్ఘ విరామం తర్వాత సాయ్ సెంటర్‌కు వెళ్లిన క్రమంలో వీరికి కరోనా సోకింది. సాయ్ సెంటర్‌కు 20 మంది ఆటగాళ్లు హాజరు కాగా అందులో ఆరుగురికి కరోనా సోకడంతో కలవరం మొదలైంది. కరోనా సోకిన హాకీ ఆటగాళ్లలో మన్‌దీప్, మన్‌ప్రీత్ సింగ్‌లతో పాటు సురేంద్ర కుమార్, జస్కరన్ సింగ్, వరుణ్ కుమార్, కృష్ణ బహదుర్ పాఠక్‌లు ఉన్నారు. వీరంతా ప్రస్తుతం తేలికపాటి లక్షణాలతో చికిత్స తీసుకుంటున్నట్లు సాయ్ వెల్లడించింది.

# జీడిపిక్కలు రూ.12 వేలకు కొనుగోలు చేయాలి

పలాస : ఆరుగాలం కష్టపడి పండించే జీడి రైతులకు అన్యాయం జరుగు తోందని ప్రభుత్వం మద్దతుధర రూ.12వేలకు పెంచితే బాగుండేదని భాజపానాయకులు మాజీ ఎంపీ డా.కె.విశ్వనాథం అన్నారు. పలాసలో సోమవారం జనసేనంాయకులతో సమావేశ మయ్యారు. 2018లో జీడిపిక్కకు రూ.ధర 14వేలు, 2019లో రూ.12 వేలు పలికిందన్నారు. గతేడాది తిత్లీ తుపానుతో జీడిపంట పూర్తిగా ధ్వంసమైందని ఈఏడాది రైతులు పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. రూ.12వేలకు జీడిపిక్కలు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జనసేన నాయకులు హరీశ్‌కుమార్‌శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం జీడి పిక్కల(80 కిలోల) బస్తాను రూ.10వేలకు కొనుగోలు చేయాలని ఉద్దాన రైతుల సమస్యల సాధన కమిటీ అధ్యక్ష, గౌరవాధ్యక్షుడు మామిడి మాధవరావు, ఉదయకుమార్ డిమాండు చేశారు. ఇలా విక్రయాలు చేపట్టి రైతులను మోసగించడం సరికాదని హెచ్చరించారు.

# సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ జకియా ఖానం



అమరావతి : నూతన ఎమ్మెల్సీగా ఎన్నికైన జకియా ఖానం సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సామాన్య కుటుంబానికి చెందిన ఆమెను ఎ?మ్మెల్సీగా ఎంపిక చేసినందుకు సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జగన్ అన్న ఇచ్చిన ఈ అవకాశాన్ని రాయచోటి అభివృద్ధికి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. మైనారిటీలకు ఇంత ప్రాధాన్యం ఇవ్వడం కేవలం వైఎస్ జగన్‌కే సాధ్యమవుతుందని కొనియాడారు. మహిళా సమస్యలపై పోరాటం చేసి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. అలాగే తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గవర్నర్ కోటాలో రాయచోటి ఎమ్మెల్సీ స్థానం నుంచి జకియా ఖానం నియమితులైన విషయం తెలిసిందే. ఈమె ఆరేళ్ల పాటు ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు. కాగా సీఎం జగన్ ఆశీస్సులతో ఒక మైనారిటీ మహిళకు ఎమ్మెల్సీ ఇవ్వడం ఆనందంగా ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మహిళల సమస్యలపై ఆమె స్పందించనుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను ఎప్పుడూ తప్పరని పునరుద్ఘాటించారు.

# ఎంసెట్ ఇంజినీరింగ్ సెప్టెంబర్‌లో

***- 9, 10, 11, 14 తేదీలలో పరీక్ష - ఈ నెల 31న ఈసెట్, సెప్టెంబర్ 2న పాలిసెట్***

***- ఇతర పరీక్షలపై త్వరలో నిర్ణయం***

***-అక్టోబర్‌లో అడ్మిషన్లు!***

హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రవేశ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ సమాయత్తమవుతున్నది. సెప్టెంబర్‌లో 9, 10, 11, 14 తేదీలలో ఎంసెట్‌లో ఇంజినీరింగ్ విభాగానికి మాత్రమే ప్రవేశపరీక్ష నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నెల 31న ఈసెట్, సెప్టెంబర్ 2న పాలిసెట్ నిర్వహిస్తారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డితో సోమవారం జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్, ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ సయ్యద్ ఒమర్‌జలీల్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన పాల్గొన్నారు. ఎంసెట్‌లో ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగంతోపాటు ఎడ్‌సెట్, ఐసెట్, పీజీఈసెట్, లాసెట్ వంటి ప్రవేశపరీక్షల తేదీలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తారు. టీసీఎస్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని, ఆ స్లాట్ ప్రకారం మిగిలిన ప్రవేశ పరీక్షల తేదీలను ఖరారుచేస్తామని పాపిరెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 1-6 వరకు జేఈఈ మెయిన్, అదే నెల 13న నీట్ ఉండడంతో ఆ తేదీల్లో ఎంసెట్ నిర్వహించడం లేదని చెప్పారు. నీట్‌కు హాజరయ్యే విద్యార్థుల ప్రిపరేషన్ కోసం సెప్టెంబర్ 12న కూడా ప్రవేశ పరీక్ష నిర్వహించడం లేదన్నారు.

### కొవిడ్-19 నిబంధనలు పాటిస్తూ

రాష్ట్రంలో ఎంసెట్ సహా అన్ని ప్రవేశ పరీక్షలను కొవిడ్ నిబంధనలను పాటిస్తూ నిర్వహించనున్నారు.

పరీక్ష కేంద్రాలను రెండు పూటలా శానిటైజ్ చేస్తారు. వాటర్ బాటిళ్లను విద్యార్థులే తెచ్చుకోవాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు భౌతిక దూరం పాటించేలా కంప్యూటర్ బేస్డ్‌టెస్ట్ (సీబీటీ) కేంద్రంలో చర్యలు తీసుకొంటారు. వైరస్‌వ్యాప్తి నేపథ్యంలో పరీక్షలను ప్రతిరోజు రెండు పూటలు నిర్వహిస్తారు. ఉదయం 18 వేలు, మధ్యాహ్నం 18 వేల చొప్పున విద్యార్థు లకు ఎంసెట్ నిర్వహించాలని భావిస్తున్నారు.

### హైకోర్టులో కేసులు

ప్రస్తుతం డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు, ప్రవేశ పరీక్షల నిర్వహణకు సంబంధించిన అంశం కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నదని విద్యామండలి చైర్మన్ చెప్పారు. సెప్టెంబర్ 9 నుంచి నిర్వహించనున్న ప్రవేశపరీక్షలకు సంబంధించి వివరణ హైకోర్టుకు వివరిస్తామని తెలిపారు. డిగ్రీ ఫైనలియర్ పరీక్షలపై కోర్టు తీర్పు తర్వాత నిర్ణయం వెలువరిస్తామన్నారు.

# ఖచ్చితంగా ఏడాది చివరికి వ్యాక్సిన్ : ట్రంప్



హైదరాబాద్: ఈ ఏడాది చివరి కల్లా కరోనా వైరస్‌కు వ్యాక్సిన్ వస్తుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. కచ్చితంగా వ్యాక్సిన్ వస్తుందని బలంగా నమ్ముతున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటి వరకు తమ దేశంలో 65 మిలియన్ల మందికి వైరస్ పరీక్షలు చేపట్టినట్లు ట్రంప్ తెలిపారు. తమకు దగ్గరలో ఏదేశం కూడా లేదన్నారు. వైరస్ పరీక్షలు చేపట్టిన దేశాల్లో భారత్ రెండవ స్థానంలో ఉన్నట్లు ట్రంప్ వెల్లడించారు. చైనా వైఖరి పట్ల అసహనంతో ఉన్నట్లు ట్రంప్ తెలిపారు. చైనా మంచి చేయలేదన్నారు. ఒకవేళ మేం ఎన్నికల్లో నెగ్గితే ఇరాన్ తమతో ఒప్పందం కుదుర్చుకుంటుందని ట్రంప్ తెలిపారు. చైనాతో డీల్ చేసుకోవాలా వద్దా అన్న అంశంలో సందేహం నెలకొన్నట్లు ఆయన చెప్పారు. అయితే ట్రంప్ మీడియా సమావేశం నిర్వహిస్తున్న సమయంలో.. వైట్‌హౌజ్ వద్ద కాల్పుల ఘటన చోటుచేసుకున్నది. దాంతో ఆయన మధ్యలోనే మీడియా సమావేశాన్ని వదిలి వెళ్లారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని

# ఋషికేశ్ శాఖా భవనంలో కొలువై ఉన్న గీతాచార్యునికి ప్రత్యేక పూజలు



విశాఖపట్నం : శ్రీకృష్ణ జన్మాష్టమి అంటే అత్యంత పవిత్రమైన రోజు. సర్వ లోకాలకి ఆరాధ్యదైవమైన శ్రీకృష్ణపరమాత్మ పుట్టినరోజు. అలాంటి రోజున విశాఖ శ్రీ శారదాపీఠంలో ఋషికేశ్ శాఖా భవనంలో చాతుర్మాస్యదీక్షలో భాగంగా అత్యంత సంప్రదాయ భధంగా నడిచింది. పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి వారు మరియు ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామివార్లు ప్రత్యేకముగా శ్రీకృష్ణ జన్మాష్టమినాడు ఋషికేశ్ శాఖా భవనంలో కొలువై ఉన్న గీతాచార్యునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గంగాస్నానమాచరించి, శ్రీకృష్ణ భగవానుడికి పవిత్ర జలాలతో పాటు, పంచామృతాలతో అభిషేకం చేసి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం ఇరువురు స్వాములు, అలాగే వేదపండితులు వేదవిద్యార్థులతో పాటు అందరూ శ్రీకృష్ణ నామాన్ని సంకీర్తన గావించారు. శ్రీస్వామివారు మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి అంటే మనం అత్యంత విశేషంగా జరుపుకుంటాము. చాతుర్మాస్య దీక్షలో నిత్యమూ సాయంత్రం పీఠార్చన అనంతరం భగవద్గీత శంకరభాష్యాని చెప్పుకోవడం మన అదృష్టం. శ్రీకృష్ణుడుని మనం సాక్షాత్తు శ్రీమన్నారాయుడి అవతారంగా కొలుస్తూ ఉంటాం. వేదవేద్యుడైన ఆ పరమాత్మయే శ్రీకృష్ణ భగవానుడిగా అవతరిస్తే వేదమే భగవద్గీతగా అవతరించింది. వేదము అధ్యాయనం చేయలేనివారికి, వేదసారాన్ని తెలుసుకోవాలనే కుతుహలం ఉన్నవారికి భగవద్గీతని తెలుసుకుంటే వేదసారం తెలియబడుతుంది. ఆయన అవతారం చాలించిన ఆ దివ్య మంగళ విగ్రహాన్ని, భగవద్గీతను శ్రీకృష్ణ నామాన్ని భక్తులకు గొప్ప ఆస్తిగా అందించి వెళ్ళేడు. ప్రతీ ఏటా చాతుర్మాస్య దీక్షలో గంగా తీరాన మోక్షభూమిగా కొలిచే ఈ హిమాలయ ప్రాంతం ఋషికేశ్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి జరుపుకోవడం మన అందరి యొక్క పుణ్యసుకృతం.

ఈ సంవత్సరం కరోన భారిన పడినవారంతా త్వరగా కోలుకోవాలని శ్రీ కృష్ణ భగవానుడిని ప్రార్థిస్తున్నాము. ప్రతీ ఇంటా శాంతి నెలకొనాలని ఆ భగవంతుడిని ఆరాధిస్తున్నాము అని తెలియజేశారు.



కృష్ణాష్టమి సందర్భంగా గోపిక వేషధారణలో చిన్నారి బెందాళం వి.హారిక (విశాఖ వ్యాలీ స్కూల్, యూకేజీ)





కృష్ణాష్టమి సందర్భంగా శ్రీ కృష్ణుని వేషధారణలో చొక్కాకుల యశ్వంత్ పవన్

# ప్రజలకు సీఎం జగన్ శుభాకాంక్షలు



అమరావతి: గోకులాష్టమి సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణ పరమాత్ముడు బోధించిన ధర్మ, కర్మ సిద్ధాంతాలు మనమంతా ధర్మమార్గంలో నడిచేలా ఎల్లప్పుడూ స్ఫూర్తి నింపుతూనే ఉంటాయన్నారు. ప్రజలంతా శాంతిసౌఖ్యాలతో, ఆయురా రోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం జగన్ మంగళవారం ట్వీట్ చేశారు.

# వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పెనుమత్స తనయుడు

అమరావతి: వైకాపా నేత మోపిదేవి వెంకటరమణ రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో ఎమ్మెల్సీ స్థానం ఖాళీగా ఉంది. ఈ నెలలోనే ఆ స్థానం భర్తీకి ఎన్నికలు జరగనున్నాయి. దీంతో వైకాపా తమ ఎమ్మెల్సీ అభ్యర్థిని తాజాగా ఖరారు చేసింది. పార్టీ తరపున పోటీగా ఇటీవల మృతి చెందిన మాజీ మంత్రి.. వైకాపా సీనియర్ నేత పెనుమత్స సాంబశివరావు తనయుడు, విజయనగరం జిల్లా మొయిదాకు చెందిన సురేశ్‌బాబును దింపాలని సీఎం జగన్ నిర్ణయించారు. ఇప్పటికే ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయింది. నామినేషన్ దాఖలుకు ఈనెల 13 ఆఖరి తేదీ.

తొలుత వేరొకరి పేరును జగన్ అనుకున్నా.. తొలి నుంచి వైకాపాతో ఉన్న పెనుమత్స కుటుంబానికి న్యాయం చేయాలన్న ఉద్దేశంతో జగన్ మనసు మార్చుకుని సురేశ్‌బాబు పేరును ఖాయం చేశారు. ఈనెల 24న ఎన్నిక జరగాల్సి ఉంది. ఎమ్మెల్యే కోటాకు సంబంధించిన ఈ స్థానం సంఖ్యాపరంగా వైకాపాకు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మాత్యులు ధర్మాన కృష్ణదాస్ ను విశాఖ సర్క్యూట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేస్తున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిఐజి నాగలక్ష్మి, సిబ్బంది.



అమరావతి లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మరియు రాష్ట్ర రెవిన్యూ శాఖామాత్యులు ధర్మాన కృష్ణదాస్ మరియు రాష్ట్ర మత్స్య మరియు పశు సంవర్ధక శాఖా మాత్యులు సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా రొక్కం సూర్యప్రకాష్, రొక్కం సత్యన్నారాయణ తదితరులు బీజేపీ నుండి వైయస్ఆర్‌సీపీ లోకి పార్టీ జెండా కప్పి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా టెక్కలి నియోజకవర్గం ఇంఛార్జ్ దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్, హనుమంతు కిరణ్ కుమార్, అందవరపు, సూరిబాబు, తమ్మానవారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖామాత్యులు ధర్మాన కృష్ణదాస్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేస్తున్న లక్కీ షాపింగ్ మాల్ పార్టనర్ స్వామి

# ‘ఉపరాష్ట్రపతి పదవికే వెంకయ్య వన్నెతెచ్చారు’

## కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్




దిల్లీ: తన పదవీ కాలంలో మూడో ఏడాది కీలకమని, ఆ సమయంలో కీలక బిల్లులకు ఆమోదం లభించిందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ట్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370 రద్దు, పౌర సవరణ చట్టం వంటి బిల్లులు ఆమోదం పొందాయన్నారు. వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టి మంగళవారం నాటితో మూడేళ్లు పూర్తయ్యాయి. ఈ మూడేళ్ల ప్రయాణంలో ఎదురైన ప్రధానఘట్టాలను క్రోడీకరించి ‘కనెక్టింగ్, కమ్యూనికేటింగ్, ఛేంజింగ్’ పేరుతో రూపొందించిన పుస్తకాన్ని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విడుదల చేశారు. ఈ పుస్తకం డిజిటల్ వెర్షన్‌ను కేంద్ర సమాచార, ప్రసారశాఖల మంత్రి ప్రకాశ్‌జావడేకర్ ఆవిష్కరించారు. 250 పేజీల ఈ పుస్తకాన్ని కేంద్ర సమాచార, ప్రసారశాఖకు చెందిన ప్రచురణల విభాగం రూపొందించింది. ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు చేసిన ప్రసంగాలు, ప్రయాణాలు, ఇతర ముఖ్యకార్యక్రమాలన్నింటికీ ఇందులో స్థానం కల్పించారు.. మూడేళ్ల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా.. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తదితరులు వెంకయ్యకు అభినందనలు తెలిపారు. పుస్తకావిష్కరణ అనంతరం రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ...ఉపరాష్ట్రపతి పదవికే వెంకయ్య నాయుడు వన్నెతెచ్చారని అభినందించారు. కీలక సందర్భాల్లో ఆయన వ్యవహరించిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. వెంకయ్య నాయుడు మాటల్లోనూ కళాత్మకత ఉంటుందన్నారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... ఉప రాష్ట్రపతిగా మూడేళ్లు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. దేశ ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. గత మూడేళ్లలో రాజ్యసభ చాలా మారింది, సభ పనిచేసే సమయం పెరిగిందన్నారు. రాజ్యసభలో అనేక కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయని, ముఖ్యమైన బిల్లులపై సమగ్ర చర్చకు అవకాశం లభించిందన్నారు.

‘‘మొదట్నుంచీ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నా. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. దేశంలో ప్రస్తుతం కరోనా మహమ్మారి విజృంభిస్తోంది.కరోనా మహమ్మారి నుంచి దేశ ప్రజలను కాపాడాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నా. త్వరలోనే సాధారణ పరిస్థితులు రావాలని కోరుకుంటున్నా. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మరిన్ని పరిశోధనలు, అవిష్కరణలు రావాలి.

నూతన ఆవిష్కరణల్లో యువత పాత్ర కీలకం కావాలి. జన్మభూమి రుణం తీర్చుకునేలా యువత కార్యక్రమాలు చేపట్టాలి. పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యం. ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి రావాలి. ఆర్థిక స్థిరత్వానికి ఇటీవల కాలంలో చాలా చర్యలు తీసుకున్నారు’’ అని వెంకయ్యనాయుడు వివరించారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com